మానేరు
# జనత ®
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక

01.03.2025
శనివారం Saturday
సంపుటి (Volume): 09
సంచిక (Issue) : 318
పేజీలు : 8
Pages : 8
Published from : Karimnagar


సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

## అఫ్గాన్‌తో మ్యాచ్ వర్షార్పణం..
సెమీస్‌కు చేరిన ఆస్ట్రేలియా



# నిధుల మంజూరు మీ నైతిక బాధ్యత

## తెలంగాణకు ఏం చేశారో చెప్పండి కిషన్‌జీ !

## మీ వ్యాఖ్యలు పూర్తిగా బాధ్యతారాహిత్యం

- ప్రాజెక్టుల కోసం మిమ్మల్ని కలిసిన విషయం గుర్తు చేస్తున్నా!
- రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యం పాలన సాగిస్తున్నాం
- కీలక ప్రాజెక్టులకు కేంద్ర విధివిధానాలను పాటిస్తున్నాం
- సమాఖ్య స్ఫూర్తితో ప్రధాని, కేంద్ర మంత్రులను కోరుతున్నాం

**దేశంలో తెలంగాణ రాష్ట్రం ఉందని ముందు గుర్తించండి. కేంద్ర మంత్రి స్థానంలో ఉన్న మీరు.. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర హక్కులను సాధించడంపై దృష్టి సారించండి. బెంగళూరు, చెన్నై నగరాలపై చూపుతున్న ప్రేమ హైదరాబాద్ నగరంపై ఎందుకు చూపలేక పోతున్నారని కేంద్రాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఇటీవల కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా చేసిన కామెంట్స్ పై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం ఆయనకు లేఖ రాశారు. రాష్ట్రంపై కేంద్రం చూపుతున్న వివక్షను సీఎం లేవనెత్తుతూ సీఎం లేఖలో పేర్కొన్నారు.**



**హైదరాబాద్, జనతా న్యూస్:** కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 9 పేజీల లేఖ రాశారు. 'తెలంగాణ రాష్ట్రానికి ప్రాజెక్టుల మంజూరులో కేంద్ర క్యాబినెట్ మంత్రిగా మీ బాధ్యతను గుర్తు చేయడం కోసం లేఖ' అని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రాలకు ప్రాజెక్టుల మంజూరులో సీఎం రేవంత్ రెడ్డి అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారన్న వ్యాఖ్యలు పూర్తి బాధ్యతారాహిత్యమని, తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రిగా తెలంగాణకు కిషన్ రెడ్డి ఏం చేశారో చెప్పాలన్నారు.


మిగతా 2 లో



## రేపు నగరంలో ఉపరాష్ట్రపతి పర్యటన

- భద్రతా ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష


02



## హరీశ్ రావుకు బిగ్ షాక్

- హరీశ్‌రావు, ఆయన అనుచరులు బెదిరిస్తున్నారని కాంగ్రెస్‌నేత ఫిర్యాదు
- బాచుపల్లి ఠాణాలో కేసు నమోదు

02



## గ్లోబల్ లీడర్ షిప్‌లో యువతదే కీలక పాత్ర


- శాస్త్రవేత్తలను యువత ఆదర్శంగా తీసుకోవాలి
- యూపీఐ లావాదేవీలలో భారత్ అగ్రగామి
- సైన్స్ అండ్ టెక్నాలజీలో ముందుకు సాగాలి
- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
- సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి విజ్ఞాన్ వైభవ్ ప్రారంభం

02

## దేశ ప్రగతి, రక్షణకు నూతన ఆవిష్కరణలు అవసరం

02

- దేశరక్షణలో హైదరాబాద్ కీలకం
- నేషనల్ సైన్స్‌డే ఎగ్జిబిషన్‌లో రేవంత్‌రెడ్డి



## సొరంగంలో 8మంది సజీవసమాధి

అత్యాధునిక రాడార్‌తో గుర్తించిన అధికారులు
బురదలో కూరుకు పోయిన వారి శవాలు

04

## మామునూరు ఎయిర్‌పోర్టుకు రెక్కలు

విమానాశ్రయ విస్తరణకు కేంద్రం ఆమోదం
ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రమంత్రి రామ్మోహన్



02

## ఆ 8 మంది బతికే ఛాన్స్ లేదు!



- అద్భుతం జరిగితే తప్ప అవకాశం లేదు
- బీఆర్ఎస్ శవాల మీద పేలాలు ఏరుతున్నది
- పదేండ్లలో ఎస్ఎల్‌బీసీ ఎందుకు పూర్తి చేయలేదు?
- మంత్రి జూపల్లి షాకింగ్ కామెంట్స్

02



## 6న తెలంగాణ కేబినెట్ భేటీ

- పలు కీలక అంశాలపై చర్చ

02

## వృద్ధులనూ వదలని అత్యాచార నిందితుడు

- ట్యాక్సీలో తీసుకెళ్లి నగలు, నగదు లాక్కోవడం అలవాటు
- పుణె అత్యాచార ఘటనలో షాకింగ్ విషయాలు



04



## మహిళల కోసం మినీ ఇండస్ట్రియల్ పార్క్


- దళిత పారిశ్రామికవేత్తలకు మరింత ప్రయోజనం
- ఫిక్కీ సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు

## అస్తవ్యస్తంగా కాంగ్రెస్ పాలన

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

03





## కెనాల్‌లో నీళ్లు రాకపోడంపై అన్నదాతల ఆగ్రహం


- సాలురా క్యాంప్‌లో ఇరిగేషన్ అధికారుల నిర్బంధం

# రేపు ఉపరాష్ట్రపతి పర్యటన



**హైదరాబాద్,ఫిబ్రవరి28 :** మార్చి 2వ తేదీన రాష్ట్రంలో ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కడ్ పర్యటిచనున్నారు. ఈ సందర్భంగా తగిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉన్నతాధికారులతో శుక్రవారం సచివాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తూ తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆమె సూచించారు. కాగా ఉపరాష్ట్రపతి హైదరాబాద్ లోని ఐఐటిని సందర్శించి అక్కడి అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులతో ముచ్చటిస్తారని సిఎస్ తెలియజేశారు. అనంతరం నగరంలోని ఓ ప్రైవేట్ కార్యక్రమంలో కూడా పాల్గొని అదే రోజు తిరిగి న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. ఉపరాష్ట్రపతి పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖకు సి.ఎస్ సూచించారు. ఆర్ అండ్ బి శాఖ, పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వైద్యారోగ్య శాఖకు అర్హులైన వైద్యులు, ఇతర సామాగ్రి అందుబాటులో ఉంచాలని సూచించారు. అదేవిధంగా, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఇంధన శాఖకు చెప్పారు. ఈ సమావేశంలో హోం స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవిగుప్తా, ఆర్ అండ్ బి స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, పొలిటికల్ సెక్రటరీ రఘునందన్ రావు, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ డాక్టర్ ఎస్ హరీష్, హైదరాబాద్, సంగారెడ్డి కలెక్టర్లు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఉపరాష్ట్రపతి పర్యటన సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయి.

# హరీశ్ రావుకు బిగ్ షాక్



**హైదరాబాద్, ఫిబ్రవరి 28:** బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావుపై మరో కేసు నమోదు అయింది. బాచుపల్లి పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. హరీష్‌రావు, ఆయన అనుచరులు బెదిరిస్తున్నారని కాంగ్రెస్ నేత చక్రధర్ గౌడ్ బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఏ -1 గా వంశీ కృష్ణ, ఏ -2 గా హరీష్‌రావు, ఏ-3 సంతోష్‌కుమార్, ఏ-4గా పరుశు రాములు పేర్లు చేర్చారు. బీఎస్ఎన్ యాక్ట్‌ప్రకారం కేసు నమోదు చేసిన బాచుపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## కెనాల్‌లో నీళ్లు రాకపోడంపై
# అన్నదాతల ఆగ్రహం



**బోధన్ రూరల్, ఫిబ్రవరి 28 :** రైతుల ఫిర్యాదుతో గ్రామానికి పరిశీలనకు వచ్చిన అధికారులను రైతులు నిర్బంధించిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. నిజాంసాగర్ డి 28 కెనాల్‌లో నీళ్లు రావడం లేదని ఫిర్యాదు చేయడంతో ఇరిగేషన్ అధికారులు కెనాల్‌ను పరిశీలించడానికి శుక్రవారం గ్రామానికి వచ్చారు. దీంతో ఆగ్రహించిన రైతులు నిజాంసాగర్ కెనాల్ నీటిని విడుదల చేసి వారం రోజులు కావస్తున్న కింది ఆయకట్టుకు నీళ్లు రాకపోవడంతో రైతులు ఇరిగేషన్ అధికారులను గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించి తాళం వేశారు. నిజాంసాగర్ కెనాల్ నీరు చివరి ఆయకట్టు వరకు అందకపోవడంతో పంటలు ఎండుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరిగేషన్ అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యాలయంలో తాళం వేశామని రైతులు చెప్పారు. విషయం తెలుసుకున్న బోధన్ రూరల్ సీఐ విజయబాబు, బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి, సంఘటన స్థలాన్ని చేరుకొని రైతులతో మాట్లాడి సముదాయించారు.

# 6న తెలంగాణ కేబినేట్ భేటీ



**హైదరాబాద్,ఫిబ్రవరి28 :** రాష్ట్ర మంత్రివర్గ సమావేశం మార్చి 6వ తేదీన నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగనుంది. ఈ కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. రాష్ట్రంలో రెండో దఫా కులగణన నిర్వహించిన నేపథ్యంలో వాటికి సంబంధించిన గణాంకాలపై కేబినెట్ చర్చించనుంది. అలాగే బిసిలకు రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు మార్చిలో ప్రత్యేకంగా అసెంబ్లీని సమావేశపరుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఈ అంశాలపై కూడా మంత్రి మండలి చర్చించే అవకాశం ఉన్నట్టుగా తెలిసింది. అలాగే రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారికి కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేపట్టాలని సిఎం అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ కారణంగా పలు జిల్లాల్లో ఈ విషయంలో తర్జనభర్జన జరుగుతోంది. మార్చి 3వ తేదీతో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియనుంది. దీంతో కొత్త రేషన్ కార్డుల పంపిణీపై కేబినెట్‌లో చర్చించే అవకాశం ఉందని సమాచారం. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు పలు అంశాలపై కేబినెట్ నిర్ణయం తీసుకోనున్నట్లుగా తెలిసింది.

# నిధుల మంజూరు మీ నైతిక బాధ్యత

మొదటి పేజీ తరువాయి



తెలంగాణ అభివృద్ధికి హైదరాబాద్ మెట్రో ఫేజ్, ప్రాంతీయ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్), మూసీ పునరుజ్జీవనం, రీజినల్ రింగ్ రైలు, డ్రైపోర్ట్ ఏపీలోని బందరు సీ పోర్టుకు గ్రీన్ ఫీల్డ్ రహదారి కీలకమని అన్నారు. వాటి నిర్మాణాలకు సంబంధించి అనుమతుల కోసం కేంద్ర ప్రభుత్వ విధివిధానాలను పూర్తిగా పాటిస్తున్నామని తెలిపారు. ఆయా ప్రాజెక్టుల సాధన కోసం ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులతో పాటు మిమ్మల్ని (కిషన్ రెడ్డి) కలిసిన విషయాన్ని గుర్తు చేస్తున్నానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మెట్రో ఫేజ్ -1 69 కి.మీ. నిర్మాణాన్ని ఉమ్మడి రాష్ట్రంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. మెట్రో రాకతో హైదరాబాద్ నగరంలో అభివృద్ధి పరుగులు పెట్టిందని, గత పదేళ్లలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 ప్రాజెక్ట్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, సీఎంగా తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత హైదరాబాద్ మెట్రో ఫేజ్-11 ప్రాజెక్టుపై పూర్తి స్థాయిలో దృష్టి సారించామని తెలిపారు. మెట్రో సేవలను విస్తరించడమే లక్ష్యంగా అయిదు కారిడార్లను ప్రతిపాదించామన్నారు. నాగోల్-రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (36.8 కి.మీ.), రాయదుర్గం-కోకాపేట నియోపొలిస్ (11.6 3.2.), ఎంజీబీఎస్- చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), మియాపూర్-పటాన్ చెరు (13.4 కి.మీ.), ఎల్బీనగర్-హయత్ నగర్ (7.1 కి.మీ.). ఈ ఐదు కారిడార్ల నిర్మాణానికి రూ. 24,269 కోట్లతో ప్రతిపాదనలు ఆమోదించాలని నాటి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీకి (2024, జనవరి 4వ తేదీ) వినతిపత్రం అందజేశామని చెప్పారు. 2024, అక్టోబరు ఏడో తేదీన ప్రస్తుత కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్కు ప్రతిపాదనలు అందజేశామని తెలిపారు. 2024, నవంబరు నాలుగో తేదీన రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖకు మెట్రో ఫేజ్- 11 డిటైయిల్డ్ రిపోర్ట్ సమర్పించామని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. 2024, డిసెంబరు 12వ తేదీన ఢిల్లీలో తాను మీతో (కిషన్ రెడ్డి) సమావేశమై హైదరాబాద్ మెట్రో ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాల లేఖను అందజేశానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తాజాగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసినప్పుడు 2025, ఫిబ్రవరి 26వ తేదీన ఇదే అంశంపై లేఖ అందజేశానన్నారు. ఈ నెల 21వ తేదీన రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ అధికారుల బృందం మిమ్మల్ని కలిసి మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని వివరించారన్నారు. తాజాగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మూసీ పునరుజ్జీవంపై లేఖను అందజేశానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# గ్లోబల్ లీడర్ షిప్‌లో యువతదే కీలక పాత్ర



**హైదరాబాద్, ఫిబ్రవరి 28:** శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోవాలని యువతకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. గ్లోబల్ లీడర్ షిప్‌లో యువతదే కీలక పాత్ర అని ఆయన స్పష్టం చేశారు. నేషనల్ సైన్స్ డే సందర్భంగా హైదరాబాద్‌లోని విజ్ఞాన్ వైభవ్-2025ను సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు. అనంతరం కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. సైన్స్ అండ్ టెక్నాలజీలో వచ్చే మార్పుల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. రక్షణ శాఖ చారిత్రాత్మక విజయాల్లో కేంద్రం విశేష పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. అయితే గత కొద్ది సంవత్సరాలుగా ఈ శాఖకు తాను మంత్రిగా ఉండడం తన అదృష్టంగా భావిస్తున్నారన్నారు. మానవుని మేధ సంపత్తు చాలా గొప్పదని చెప్పారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రక్షణ శాఖలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో దేశం కొత్త ఒరవడిని సృష్టిస్తోందని పేర్కొన్నారు. దేశంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతోందన్నారు. అన్ని రంగాల్లో భారత్ అగ్రగామిగా మారుతోందని చెప్పారు. రక్షణ శాఖ చారిత్రాత్మక విజయాల్లో కేంద్రం విశేష పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. అయితే గత కొద్ది సంవత్సరాలుగా ఈ శాఖకు తాను మంత్రిగా ఉండడం తన అదృష్టంగా భావిస్తున్నాన్నారు. మానవుని మేధ సంపత్తు చాలా గొప్పదని చెప్పారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రక్షణ శాఖలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో దేశం కొత్త ఒరవడిని సృష్టిస్తోందని పేర్కొన్నారు. దేశంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతోందన్నారు. అన్ని రంగాల్లో భారత్ అగ్రగామిగా మారుతోందని చెప్పారు.

# మామునూరు ఎయిర్‌పోర్టుకు రెక్కలు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 28 :** వరంగల్ నగర ప్రజలకు కేంద్రం శుభవార్త అందించింది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఎయిర్‌పోర్ట్ కలనినెరవేర్చింది. వరంగల్ జిల్లాలోని మామూనూర్‌లో విమానాశ్రయ అభివృద్ధికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. మామునూరు ఎయిర్-పోర్టుకు కేంద్రం అనుమతి ఇవ్వడంపై సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి కొండ సురేఖ, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శంషాబాద్ నుంచి 150 కిలోమీటర్ల దూరంలో మరో ఎయిర్‌పోర్టు ఉండరాదని జిఎంఆర్ సంస్థ గతంలో ఒప్పందం చేసుకుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం, రామ్మోహన నాయుడు జరిగిన చర్చల తర్వాత జిఎంఆర్ సంస్థ కూడా ఎలాంటి అభ్యంతరం లేదని తెలపింది. దీంతో విమానాశ్రయ పనులు చేపట్టేందుకు పౌరవిమానయాన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఎయిర్-పోర్ట్ పరిధిలో 696 ఎకరాల స్థలం ఉంది. ఆ భూమికి అదనంగా మరో 253 ఎకరాల భూమి కొంత రన్‌వే విస్తరణ, టెర్మినల్ బిల్డింగ్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ), నేవిగేషన్ ఇన్‌స్ట్రుమెంట్ ఇన్‌స్టలేషన్ నిర్మాణాలు చేపట్టనున్నారు. ఈ మేరకు భూసేకర జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.205 కోట్లను విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు మామూనూరు ఎయిర్ పోర్ట్ ఆపరేషన్స్‌కి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఉత్తర్వులు ఇచ్చారు. జీఎంఆర్ అంగీకారం తెలపడంతో విమానాశ్రయం పనులు చేపట్టేందుకు పౌరవిమానయాన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టాలని ఎయిర్ పోర్ట్ అథారిటీని రామ్మోహన్ నాయుడు ఆదేశించారు. మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న 150 కి.మీ. ఒప్పందాన్ని జీఎంఆర్ సంస్థ విరమించుకుంది. నిజాం కాలంలో మామునూరు నుంచి వాయుదూత్ విమానాలు నడిచేవి. భారత్, చైనా యుద్ధ సమయంలో కీలక సేవలందించాయి. దాదాపు 32 ఏళ్ల కిందట మూతపడిన మామునూరు విమానాశ్రయానికి మళ్లీ 'రెక్కలు' రానున్నాయి. అప్పుడప్పుడు శిక్షణ ఎయిర్‌క్రాఫ్ట్‌లు నడుస్తున్న ఈ విమానాశ్రయం నుంచి మళ్లీ విమానం ఎగరనుంది. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో మామునూరు ఎయిర్‌పోర్టు కల సాకారమైందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి రావడంతో ఎయిర్‌పోర్టు పనులు వేగవంతం అవుతాయన్నారు. మామునూరు ఎయిర్‌పోర్టుకు కేంద్రం అనుమతి తెలపడం పట్ల మంత్రి కొండా సురేఖ హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేంద్ర పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

# ఆ 8 మంది బతికే ఛాన్స్ లేదు..

**హైదరాబాద్, ఫిబ్రవరి 28:** ఎస్ఎల్‌బీసీ ఘటనపై మంత్రి జూపల్లి కృష్ణారావు సంచలన కామెంట్స్ చేశారు. అద్భుతం జరిగితే తప్ప టన్నెల్‌లో చిక్కుకున్న 8మంది బతికే ఛాన్స్ లేదన్నారు. బీఆర్ఎస్ ప్రకృతి విపత్తుని రాజకీయంగా వాడుకుంటుందని, శవాల మీద పేలాలు ఎరుకుంటున్నారంటూ హాట్ కామెంట్స్ చేశారు. ఈ మేరకు శుక్రవారం టన్నెల్ ప్రమాదం గురించి మాట్లాడిన మంత్రి జూపల్లి కృష్ణారావు.. వారు బతికే ఛాన్స్ లేదన్నారు. ఇక రాజకీయ దురుద్దేశంతోనే ఈ ప్రమాదంపై బీఆర్ఎస్ నేత హరీష్ రావు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎస్ఎల్‌బీసీపై హరీష్ రావు వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదం అన్నారు. పదేండ్లు పాలించిన బీఆరెస్ ఎందుకు టన్నెల్ ను పెండింగ్ లో పెట్టిందని ప్రశ్నించారు. హరీష్ రావుకు సూటి ప్రశ్న? ఎందుకు 200 లోమీటర్లు ఎస్ఎల్‌బీసీ టన్నెల్ తవ్వి మిగతాది వదిలేసింద్రు? తక్కవ లాభం వస్తుందనా? ఎస్ఎల్‌బీసీ పూర్తి అయితే కాంగ్రెస్‌కు పేరు వస్తుందనా? ఈ మూడు ప్రశ్నలకు హరీష్ రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## బీఆర్ఎస్‌శవాల మీద పేలాలు..

అతి తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ఎస్ఎల్‌బీసీని ఎందుకు పెండింగ్ పెట్టారు. ఎస్ఎల్‌బీసీ గురించి మాట్లాడే హక్కు బీఆర్ఎస్‌కు లేదు. బీఆర్ఎస్‌శవాల మీద పేలాలు ఎరుకుంటోంది. అద్భుతం జరిగితే తప్ప టన్నెల్‌లో చిక్కుకున్న 8మంది బతికే చాన్స్ లేదు. సహాక చర్యలకు ఇంకా రెండు రోజులు పట్టే అవకాశం ఉంది. ప్రమాదం జరిగినప్పుడు కంపెనీ వాళ్ళు అలెర్ట్ చేయకపోతే 40 మంది వరకు చనిపోయే వారు. పాలమూరు రంగా రెడ్డిలో ఆరుగురు చనిపోయారు. అప్పుడు కేసీఆర్, హరీష్ రావు వచ్చారా? కొండగట్టు బస్ ప్రమాదంలో 70మంది చనిపోతే వీరెక్కెడపోయారని విమర్శించారు.

## దేశ ప్రగతి, రక్షణకు నూతన
# ఆవిష్కరణలు అవసరం

**హైదరాబాద్, ఫిబ్రవరి 28:** దేశాన్ని రక్షించడంలో హైదరాబాద్ అత్యంత క్రియాశీలక పాత్ర పోషిస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు గచ్చిబౌలి స్టేడియంలో శుక్రవారం నేషనల్ సైన్స్ డే ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఎగ్జిబిషన్‌ను కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు. డీఆర్‌డీవో, డిఫెన్స్, ఏరోస్పేస్ ఉత్పత్తులకు చెందిన 200 స్టాల్స్ ప్రదర్శించారు. డిఫెన్స్, ఏరోస్పేస్ రంగంలో భారత సామర్థ్యాలను ప్రదర్శించేలా స్టాల్స్ ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు నేషనల్ సైన్స్ డే ఎగ్జిబిషన్ జరగనుంది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ దేశ రక్షణ బాధ్యత యువతీ యువకులపై ఉందని చెప్పారు. బీడీఎల్, డీఆర్డీఓ, మిదానీ, హెచ్ఏఎల్ వంటి దేశ రక్షణ కోసం రాకెట్లు, మిస్సైల్స్ తయారు చేస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి హైదరాబాద్ నగరం, హైదరాబాద్ చుట్టూ పరిశ్రమలు ఉన్నాయన్నారు. లక్షలాది మంది విద్యార్థులకు దేశభక్తి , దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యతపై వారిలో స్ఫూర్తిని, అవగాహన కల్పించడానికి ఈ ప్రత్యేకమైన ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రతి ఏటా లక్షకుపైగా ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు, ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్ చదివి, అమెరికాకు వెళ్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. వారిలో దేశభక్తితో, దేశ రక్షణ ప్రాధాన్యతనలు వివరించడానికి ఈ వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నామని అన్నారు. తెలంగాణ నుంచి కేవలం ఐటీ ప్రొఫెషనల్స్ మాత్రమే అమెరికాకు వెళ్లకుండా, దేశ రక్షణ రంగానికి అవసరమైన సమర్థవంతమైన ఇంజినీర్లు అందించేందుకు ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. దేశ రక్షణ కోసం అవసరమైన ఇంజినీర్లను తయారుచేయడం మరింత ముఖ్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. స్వాతంత్ర్యానికి ముందు, ఆ తర్వాత కూడా హైదరాబాద్‌లో బీడీఎల్, హెచ్ఎచ్ఎల్, మిదాని, డీఆర్‌డీఓ వంటి అనేక సంస్థలు దేశ రక్షణ కోసం ఉత్పత్తి రంగంలో విశేషంగా పని చేస్తున్నాయని తెలిపారు. దేశ రక్షణ రంగానికి హైదరాబాద్, బెంగళూరు ముఖ్య కేంద్రాలుగా ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. గతంలో మీతో చర్చించినట్లుగా హైదరాబాద్-బెంగళూరు డిఫెన్స్ ఇండస్ట్రీయల్ కారిడార్‌గా ప్రకటించాలని.. తద్వారా భారీగా పెట్టుబడులు వస్తాయని అన్నారు. రాకెట్ తయారీ సహా ఆకాశ మార్గం (స్కై రూట్) వంటి స్టార్టప్‌లు అభివృద్ధి చెందుతాయని.. అందుకోసం కేంద్ర ప్రభుత్వ సహకారం, మద్దతు అవసరమని తెలిపారు. రక్షణ రంగంలో భారతదేశాన్ని నంబర్ వన్ స్థాయికి తీసుకెళ్లేందుకు తాము ప్రయత్నిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



# పనిచేసిన వారికి పదవులు ఇస్తాం



- పనిచేయని వారి పదవులు ఊడబెరుకుతాం
- రాహుల్ ప్రధాని అయితేనే దేశానికి రక్ష
- కష్టపడ్డవారికి గుర్తింపు ఎప్పుడూ ఉంటుంది
- పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో సీఎం రేవంత్

**హైదరాబాద్,ఫిబ్రవరి 28:** పదవులు రాలేదని కాంగ్రెస్ నేతలు ఎవరూ నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి కచ్చితంగా పదవులు వస్తాయన్నారు. రాహుల్ గాంధీని ప్రదాని చేయడమే లక్ష్యంగా అంతా కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గాంధీభవన్‌లో జరిగిన టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో కాంగ్రెస్ కొత్త ఇన్చార్జి మినాక్షి నటరాజన్‌తో పాటు సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. నాలుగైదేళ్లు జిల్లా అధ్యక్షులుగా పనిచేసిన వారికి నామినేటెడ్ పదవులు ఇచ్చాం. పార్టీలో నమ్మకంగా ఉన్నవారికి ఉన్నత పదవులు ఇచ్చాం. పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పిస్తున్నాం. మండలాలు, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఫీడ్‌బ్యాక్ తీసుకొని పదవులు ఇస్తాం. ప్రస్తుతం రెండేళ్ల కాలానికి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చాం. మార్చి 10 లోపు జిల్లాల వారీగా ఇన్‌ఛార్జి మంత్రులు నామినేటెడ్ పదవులకు సంబంధించిన నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. అలాగే రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసే వరకూ మనం విశ్రమించొద్దన్నారు. దేశంలోనే అత్యధిక పన్నులు కడుతున్న రాష్ట్రం తెలంగాణ. కష్టపడి పనిచేసే వారికి అవకాశాలు ఇవ్వాల్సిన బాధ్యత పార్టీపైనే ఉంటుందని అన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుంది అని తెలిపారు. పని చేసిన వారి జాబితాను కొత్త ఇంఛార్జ్ సిద్ధం చేస్తారు.. కొందరికి పదవులు రాలేదు.. మొదటి విడతలో కార్పొరేషన్ చైర్మన్లు రెండేళ్ల అవకాశం ఇచ్చాం.. పని తీరు సరిగ్గా లేని వారిని కొనసాగించామని పేర్కొన్నారు. ఇప్పుడు ఏం అనను.. రెన్యువల్ కోసం వస్తారు కదా అప్పుడు చెప్తానని తెలిపారు. పదవి వచ్చింది కదా అని కూర్చున్న వాళ్లకు కొనసాగింపు ఉండదని సీఎం రేవంత్ తేల్చి చెప్పారు. ఇక, మార్చి 10వ తేదీ లోపు ఇంఛార్జ్ మంత్రులు జిల్లాకు వెళ్ళండి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. దేవాదాయ కమిటీలు, మార్కెట్ కమిటి డైరెక్టర్ పోస్టులు ఖాళీలు ఉన్నాయి.. వాటికి సంబంధించిన జాబితా సిద్ధం చేయండి.. అందరికీ పదవులు ఇచ్చేద్దాం.. అలాగే, పదవులు వచ్చిన వాళ్ళు.. పదవి వచ్చింది నేను ఎందుకు పని చేయడం అనుకుంటున్నారు.. పదవి రాని వారు, పదవి రాలేదు కదా నేననేందుకు పని చేయడం అని అనుకుంటున్నారు.. మంచిని మైక్ లో చెప్పండి.. ఇక, పార్టీ నాయకులకు నా విజ్ఞప్తి.. ఏదైనా సమస్య అంటే చెవిలో చెప్పండి అన్నారు. గుజరాత్ మోడల్ సక్సెస్ మోడల్ కాదు.. ఆయన ప్రమోట్ చేసుకున్నారు.. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేసే వరకు కసి తగ్గొద్దు అని అన్నారు. అనుకూల వాతావరణం కోసం కాంగ్రెస్ కార్యకర్తలు కష్టపడండి అని చెప్పుకొచ్చారు. మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు అందరు అక్కడికి వెళ్లారు.. రెస్క్యూ ఆపరేషన్‌ను మంత్రులు దగ్గరుండి మరి పరిశీలించారు అని చెప్పారు. ఇక, కాస్మటిక్ చార్జీలు కేసీఆర్ పెంచలేదు.. మనం పెంచాము అని రేవంత్ రెడ్డి తెలిపారు.

# కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువే

- కాంగ్రెస్ పార్టీ కొత్త ఇంచార్జీ మీనాక్షి నటరాజన్



**హైదరాబాద్, ఫిబ్రవరి 28:** పార్టీలో ఎలాంటి అంతర్గత విభేదాలు లేవు.. మా పార్టీలోనే ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉందని కాంగ్రెస్ పార్టీ కొత్త ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ అన్నారు. తెలంగాణలో పనిచేసే అవకాశం వచ్చింది.. పీసీసీ చీఫ్, సీఎం, ఇతర నేతలు, కార్యకర్తలను కలుపుకొని పనిచేస్తానన్నారు. పార్టీ పటిష్టతకు, రాజ్యాంగ పరిరక్షణకు అందరం కలిసి పనిచేస్తామన్నారు. పార్టీ అధిష్టానం ఇచ్చిన బాధ్యతలను నెరవేరుస్తానని చెప్పారు. రాహుల్ గాంధీ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లఢానికి కృషి చేస్తానన్నారు. శుక్రవారం లేక్‌వ్యూలో బసలచేసిన ఆమెను సిఎం రేవంత్, మంత్రి పొన్నంలు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీలో అంతర్గత రాజకీయాలు లేవు..ప్రజాస్వామ్యం కాంగ్రెస్ లో ఎక్కువ..పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉంటాయి.. అందరి అభిప్రాయాలకు సముచితస్థానం కల్పిస్తూ ముందుకెళ్తామన్నా రు. తెలంగాణను సోనియా గాంధీ ఏ ఉద్దేశ్యంతో ఏర్పాటు చేశారో..ఆ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు.

# మహిళల కోసం మినీ ఇండస్ట్రియల్ పార్క్

## దళిత పారిశ్రామికవేత్తలకు మరింత ప్రయోజనం

## ఫిక్కీ సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, ఫిబ్రవరి 28 :** రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళల కోసం మినీ ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివృద్ధి చేస్తామని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు, పారిశ్రామికవేత్తలు, అధికారులతో కూడిన ప్రత్యేక బృందాన్ని నియమిస్తాం. ప్రత్యేక బృందం ఇచ్చే నివేదిక ఆధారంగా దళిత పారిశ్రామికవేత్తలకు మరింత ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటామని శ్రీధర్‌బాబు తెలిపారు. ఫిక్కిలో నిర్వహించిన తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ ఎంటర్‌ప్రైజెస్ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇండస్ట్రియల్ పార్కుల్లో ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామికవేత్తలకు 10 శాతం ప్రత్యేకంగా కేటాయిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీలు ఎదిగితేనే సమాజం అభివృద్ధి చెందుతుంది. చేవెళ్ల డిక్లరేషన్‌లో దళితులకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం కచ్చితంగా నెరవేరుస్తుంది. దళితుల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేసే పార్టీ కాంగ్రెస్ మాత్రమే. ఓవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతూనే.. మరోవైపు సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించాం. పారిశ్రామికవేత్తలకు రాయితీగా అందాల్సిన బకాయిలు రూ.4500 కోట్లకు పైనే ఉన్నాయి. వీటిలో రూ.2,200 కోట్లు ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకే రావాల్సి ఉంది. మేం అధికారంలోకి రాగానే ఈ బకాయిల చెల్లింపుపై దృష్టి సారించాం. వచ్చే నెలలో రూ.300 కోట్లు చెల్లిస్తాం. ఎక్కువ మంది కార్మికులకు ఉపాధి అందించే ఎంఎస్‌ఎంఈ ప్రత్యేక పాలసీ తీసుకొచ్చాం. స్కిల్ సెంటర్లను ఏర్పాటు చేసి పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యమున్న మానవ వనరులను అందిస్తాం. కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. రుణాలు పొందటంలో ఔత్సాహిక ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరిస్తాం. తమిళనాడు, కర్ణాటకలో పారిశ్రామిక విధానాలపై అధ్యయనం చేయడానికి కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు.






**హైదరాబాద్, ఫిబ్రవరి 28:** ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, భారత దేశ తొలి రాష్ట్రపతి డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్ వర్ధంతి సందర్భంగా జాతి ఆయనకు నివాళి అర్పించింది. రాజ్యాంగపరిషత్ ఛైర్మన్‌గా, స్వతంత్ర భారత తొలి రాష్ట్రపతిగా ఆయన జాతికి సేవ చేశారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. ఆబూ సేవలను స్మరించుకున్నారు.

# నేటి నుంచి టిజి ఎప్‌సెట్ ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 28:** రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మా, అగ్రికల్చర్ విభాగాల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టిజి ఎప్‌సెట్(ఇఎపిసెట్) ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ పక్రియ శనివారం నుంచి ప్రారంభం కానుంది. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభం కావాల్సిన ఎప్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ పక్రియ వాయిదా పడింది. ఒక పేపర్‌కు హాజరయ్యే విద్యార్థులు రూ.900 ఫీజు ఉండగా, ఎస్‌సి ఎస్‌టి వికలాంగులకు రూ.500, రెండు పేపర్లకు హాజరయ్యే విద్యార్థులు రూ.వెయ్యి, ఎస్‌సి ఎస్‌టి వికలాంగులకు రూ.1800 చెల్లించాలి. ఏప్రిల్ ఏప్రిల్ 29, 30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలకు, మే 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. పిజి ఎప్‌సెట్(ఇఎపిసెట్) దరఖాస్తులు ఈసారి దరఖాస్తులు తగ్గే అవకాశాలు ఉన్నాయి. వృత్తి విద్యా కోర్సులలో రాష్ట్రంలో 15 శాతం సీట్లకు ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు పోటీ పడే అవకాశాన్ని ప్రభుత్వం తొలగించిన నేపథ్యంలో కేవలం తెలంగాణ రాష్ట్రానికి చెందిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోనున్నారు. గత కొన్నేళ్లుగా రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు భారీ సంఖ్యలో దరఖాస్తు చేసుకుంటున్నారు. ఏటా మూడు లక్షలకుపైగా దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈసారి 2 నుంచి 3 లక్షల లోపే దరఖాస్తులు ఉండే అవకాశం ఉంది. గత ఏడాది ఎప్‌సెట్ పరీక్షకు 3,54,803 మందికి దరఖాస్తు చేసుకోగా, ఇంజినీరింగ్ విభాగానికి 2,54,543 మంది, అగ్రికల్చర్, ఫార్మా విభాగానికి 1,00,260 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు.ఈసారి ఎప్‌సెట్ దరఖాస్తుల సంఖ్య గణనీయంగా తగ్గనున్నట్లు తెలుస్తోంది.

# పనిఒత్తిడితో ఆర్‌టీసీ కండక్టర్ ఆత్మహత్య

**యాచారం, ఫిబ్రవరి 28 :** పని ఒత్తిడి కారణంగా మనస్థాపానికి గురై ఓ ఆర్టీసీ కండక్టర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది.సీఐ నందీశ్వర్ రెడ్డి కథనం ప్రకారం.. యాచారం మండల పరిది గాండ్లగూడ గ్రామానికి చెందిన కోరే అంజయ్య (40) ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గత కొంతకాలంగా ఒత్తిడికి గురవుతున్నాడు. దీంతో ఆయన 15 రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మామూలు స్థితికి చేరుకున్నారు. అయితే గురువారం సాయంత్రం మళ్లీ పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. దీంతో అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు.

# అస్తవ్యస్తంగా కాంగ్రెస్ పాలన

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్



**హైదరాబాద్, ఫిబ్రవరి 28:** రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా మారిందని, ఏరంగం సంతోషంగా లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో ప్రజాపాలన పరాకాష్టకు చేరిందని అన్నారు. విషాదంలోనూ మంత్రులు వినోదం పొందుతున్నారని కేటీఆర్ నిప్పులు చెరిగారు. హెలికాప్టర్ యాత్రలు చేస్తూ.. చేపకూర విందులతో ఎంజాయ్ చేస్తున్నారంటూ కాంగ్రెస్ మంత్రులపై కేటీఆర్ విరుచుకుపడ్డారు. హాస్టల్ విద్యార్థులకు మాత్రం అన్నం పెట్టకుండా పస్తులు ఉంచుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. విద్యార్థులకు కనీసం తిండి పెట్టలేని దుస్థితిలో రేవంత్ ప్రజా ప్రభుత్వం ఉందన్నారు. "అన్నం వండలేదు గుడిలో తినండి" అని నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం బల్మూరు మండలం కొండనాగుల ఎస్టీ బాలుర హాస్టల్ సిబ్బంది విద్యార్థులకు ఆదేశాలు ఇవ్వడం దారుణమన్నారు. కొండనాగులలోని ఎస్టీ బాలుర హాస్టల్‌లో శివరాత్రి పండుగ రోజు 380 మందికి గాను 200 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే మధ్యాహ్న భోజనం గుదిబండ శివాలయంలో చేసే అన్నదానానికి వెళ్ళి తినాలని, రాత్రి భోజనం కోసం వీరం రామాజిపల్లిలోని గంగమ్మ దేవాలయంలో అన్నదానానికి వెళ్లి తినమని విద్యార్థులకు చెప్పి హాస్టల్ సిబ్బంది వంట చేయడం మానేశారని కేటీఆర్ తెలిపారు. భోజనం కోసం అంత దూరం నడిచి వెళ్ళే ఓపిక లేక విద్యార్థులు పస్తులు ఉన్నారని కేటీఆర్ పేర్కొన్నారు. పండగ పూట విద్యార్థులకు కనీసం భోజనం పెట్టకుండా, అన్ని కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్ళి తినమని చెప్పడం ఏంటి అని విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పండగపూట విద్యార్థులను పస్తులుంచడమే ప్రజాపాలనా అని కేటీఆర్ ప్రశ్నించారు.

# కక్షలపైనే కాంగ్రెస్ పాలన


## ఆలయాలకు కేటాయించిన నిధులు రద్దు చేయడం దుర్మార్గం

## విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కవిత

**కొల్లాపూర్, ఫిబ్రవరి 28:** ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే అభివృద్ధి చేయడం మానేసి బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు కేసులు పెట్టడానికి కక్షపూరితంగా పాలన సాగిస్తుందని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులపై దాడులు చేసిన వారి చిట్టా పింకు బుక్‌లో రాస్తామని టైం వచ్చిన రోజున వారి సంగతి తేలస్తామని ప్రతిపక్షాలపై దాడులు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. శుక్రవారం కొల్లాపూర్ మండలం సింగోటం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డితో కలిసి ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడారు. సింగోటంలో లింగాకారంలో లక్ష్మీనరసింహస్వామి వారు ఉండడం అన్నది చాలా ప్రత్యేకమైనటువంటి క్షేత్రంగా గమనిస్తూ ఉన్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు స్వామివారి దగ్గరికి దర్శనం చేసుకోవడానికి వస్తూ ఉంటారని మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రత్యేకమైన క్షేత్రం కోసం కేసీఆర్ రూ. 17 కోట్లు మంజూరు చేస్తే మరి ఆ దేవుడికి ఇచ్చిన డబ్బులు కూడా జూపల్లి కృష్ణారావు క్యాన్సిల్ చేయడం అన్నది దౌర్భాగ్యం అన్నారు. ఒక ప్రభుత్వంలో ఇచ్చినటువంటి పథకాలు ఇంకొక ప్రభుత్వంలో కొనసాగాలని పేర్కొన్నారు. కానీ ఏదో ప్రజల మీద కక్ష కట్టినట్లు దేవుడిపై కక్ష కట్టి కేసీఆర్ ఇచ్చినటువంటి రూ. 17 కోట్లను క్యాన్సిల్ చేయించడం చాలా దారుణమన్నారు. తక్షణమే క్యాన్సిల్ చేసినటువంటి డబ్బుల్ని తీసుకొని వచ్చి ఆలయ అభివృద్ధి కోసం జూపల్లి కృష్ణారావు కృషి చేయవలసిందిగా డిమాండ్ చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ తరఫున నిలబడ్డటువంటి ఏ నాయకుడైనా సరే ఒక ఫేస్‌బుక్‌లో చిన్న పోస్టులు పెట్టిన లేకపోతే ఏదైనా నిలబడి ప్రశ్నించిన కూడా కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నటువంటి ఘటనలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి బీఆర్ఎస్ నాయకులపై దాడులు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్త శ్రీధర్ రెడ్డిని చంపడం కూడా జరిగిందని గుర్తుచేశారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి సొంత జిల్లా అయినా జూపల్లి కృష్ణారావు మంత్రివర్గంలో ఉన్నప్పటికీ కూడా పోలీస్ వాళ్ళ కేసు మీద పురోగతి లేకపోవడం అన్నది చాలా దారుణమని కేవలం ప్రభుత్వానికి హంతకులకు కొమ్ముగాస్తున్నారు తప్పితే ప్రజల పక్షాన మీరు నిలబడలేదని విమర్శించారు. జూపల్లి కృష్ణారావు టూరిజం మంత్రిగా కాకుండా కొల్లాపూర్ నియోజక వర్గానికి అప్పుడప్పుడు వస్తూ టూరిస్ట్ మంత్రిగా వ్యవహారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో పండే మామిడికాయలను దేశంలోని నలుమూలాలతోపాటు ఇతర దేశాలకు కూడా ఎగుమతి జరుగుతుంటాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో కొల్లాపూర్ ప్రాంతంలో మామిడి మార్కెట్ మంజూరు చేస్తే ఈ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అభివృద్ధి ఎక్కడ కూడా కనబడడం లేదు.. పదేపదే ప్రభుత్వం ఊదరగొడుతూ రైతుబంధు రుణమాఫీ అని చెప్పారు. కానీ ఇంతవరకు పూర్తిస్థాయిలో ఎక్కడ అమలు జరగలేదు. జనవరి 26 తేదీలోపు టకీటకీ మని రైతు భరోసా డబ్బులు పడతాయన్నారు. ఇప్పుడు మళ్లీ మార్చి 30 అని చెప్తున్నారు. కనీసం ఆ తేదీలోపైన రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలన్నారు. ప్రభుత్వము రైతులను, విద్యార్థులను ఆదుకుంటలేదన్నారు. ఇతర పార్టీ నాయకులపై కక్ష కట్టి వారిపై ఆగడాలకు పడుతున్నారన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి చేయకుండా బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. నిన్న రాత్రి సాతపూర్ గ్రామంలో ఇవాళ మీటింగ్ కోసం ఫ్లెక్సీ కడుతుంటే బీఆర్ఎస్ కార్యకర్త పరమేష్‌పై దారుణంగా 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు కలసి దాడి చేశారన్నారు. నీతి నిజాయితీగా పనిచేసి కొట్లాడి తెలంగాణను తీసుకొచ్చామన్నారు. ప్రతిపక్షాల మీద దాడి చేస్తే ఏమొస్తుందన్నారు. ముఖ్యమంత్రి మీ మహబూబ్‌నగర్ జిల్లా గడ్డ మీద నుంచి చెప్తున్నాను. మేము కూడా పింకు బుక్ మెయింటెన్ చేస్తాము. కార్యకర్తలపై నాయకులపై దాడి చేసిన వారి చిట్టా రాస్తాం మా టైం వచ్చినప్పుడు చెప్తామని ఆమె హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రంగినేని అభిలాష్, దూ రెడ్డి రఘువర్ధన్ రెడ్డి తదితరులు ఉన్నారు.



# సొరంగ ప్రమాదంలో 8మంది సజీవసమాధి



- అత్యాధునిక రాడార్‌తో గుర్తించిన అధికారులు
- బురదలో కూరుకు పోయిన వారి శవాలు
- బయటకు తీసుకుని వచ్చేందుకు శ్రమిస్తున్న సిబ్బంది

**నాగర్‌కర్నూలు,ఫిబ్రవరి28 :** శ్రీశైలం లిఫ్ట్ బకింగ్ కెనాల్ టన్నెల్‌లో చోటుచేసుకున్న ఘోర ప్రమాదంలో ఎనిమిది మంది సజీవ సమాధి అయ్యారు. మృతుల్లో ఆరుగురు కార్మికులు, ఇద్దరు ఇంజనీర్లు ఉన్నారు. ప్రమాదం జరిగినప్పటి నుంచే అధికారులు, రెస్క్యూ బృందాలు రంగంలోకి దిగి క్షతగాత్రుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు. మట్టిలో వారు మూడు మీటర్ల లోతులో కూరుకుపోయినట్లు అధునాతన పరికరాలు సూచించాయి. వీరు బతికి ఉంటారన్న ఆశతో చేపట్టిన పనులకు అవరోధాలు కలిగినా ముందుకు సాగారు. గ్రౌండ్ పెనట్రేటింగ్ రాడార్ మెషీన్ ద్వారా మట్టిలో కూరుకుపోయిన 5 మృతదేహాలు గుర్తించారు. ఈ 5 మృతదేహాలను వెలికి తీయడానికి మరింత సమయం పడుతుందని, కొన్ని మీటర్ల లోతు మట్టిలో మృతదేహాలు కూరుకు పోయినట్లు తెలుస్తోంది. మిగతా ముగ్గురి మృతదేహాల కోసం గాలిస్తున్నారు. ప్రమాద స్థలంలో రక్షణ చర్యలను వేగవంతం చేసేందుకు నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ రంగంలోకి దిగింది. భూమిలో కూరుకుపోయిన వారి స్థితిని తెలుసుకునేందుకు ఆధునిక టెక్నాలజీని ఉపయోగిస్తోంది. జీరో గ్రావిటీ పెనట్రేటింగ్ రాడార్ టెక్నాలజీని ఉపయోగించి, భూమిలోకి తొలగిపోయిన వారిని గుర్తించేందుకు ప్రత్యేక బృందం శ్రమిస్తోంది. మిషన్ ఆధారంగా ఎన్జీఆర్ఐ బృందం టన్నెల్‌ను పూర్తిగా స్కాన్ చేసింది. దీని సాయంతో టన్నెల్‌లో ఐదు అనుమానాస్పద ప్రదేశాలను గుర్తించింది. ఈ ప్రాంతాల్లో శరీర నిఘా కోసం మార్కింగ్ నిర్వహించారు. రక్షణ బృందాలు ఆచూకీని కనుగొని, బాధితుల మృతదేహాలను వెలికితీసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాయి.

# మూడు రాష్ట్రాల్లో హిమపాతం



- మంచుతో కప్పకుపోయిన రోడ్లు
- ఉత్తరాఖండ్‌లో మంచు చరియల కింద 57 మందికార్మికులు

**న్యూఢిల్లీ:** దేశంలోని మూడు రాష్ట్రాల్లో భారీగా మంచు కురుస్తోంది. జమ్ముకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ లలో మంచు తీవ్రంగా ఉన్నది. ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. ఎక్కడ చూసినా మంచు దిబ్బలే దర్శనమిస్తున్నాయి. కనుచూపుమేర శ్వేత వర్ణం అలుముకుంది. అక్కడ రోడ్లన్నీ శ్వేతవర్ణాన్ని తలపిస్తున్నాయి. రోడ్లపై భారీగా హిమపాతం పేరుకుపోవడంతో అధికారులు పలు రహదారుల్ని మూసివేశారు. జమ్ముకశ్మీర్‌లో ఎడతెరిపిలేకుండా మంచు కురుస్తోంది. దీంతో చాలా ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడుతున్నాయి. అప్రమత్తమైన అధికారులు జమ్ము–శ్రీనగర్ జాతీయ రహదారిని మూసివేశారు. దీంతో ఉదంపూర్ వద్ద రహదారిపై భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. బార్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ అధికారులు రోడ్డుపై పేరుకుపోయిన మంచును తొలగిస్తున్నారు.హిమాచల్ ప్రదేశ్‌లోనూ విపరీతంగా మంచు పడుతోంది. లెహ్, స్పితి సహా పలు ప్రాంతాల్లో నిరంతరంగా మంచు వర్షం కురుస్తోంది. దీంతో ఇళ్లు, వాహనాలు, రోడ్లు, చెట్లపై దట్టంగా మంచు పేరుకుపోయింది. ఇక ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో తాజాగా వర్షం కురిసింది. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో పెనుప్రమాదం చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం మంచు చరియలు విరిగిపడి బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ కు చెందిన సుమారు 57 మంది కార్మికులు చిక్కుకుపోయారు. ఇండియా–చైనా సరిహద్దు ప్రాంతంలోని ఎత్తైన పర్వత ప్రాంతం వద్ద రోడ్డు నిర్మాణం పనిలో కార్మికులు ఉండగా హిమపాతం విరుచుకుపడింది. సమాచారం తెలియగానే పోలీసులు, బీఆర్ఓ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మనా గ్రామానికి సమీపంలో మంచు చరియలు విరిగిపడి కార్మికులు చిక్కుకున్నప్పుడు సమాచారం అందిందని, వెంటనే ఐడీబీపీ, బీఆర్ఓ సిబ్బంది రంగంలోకి దిగి సహాయక చర్యలు ప్రారంభించినట్టు ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తెలిపారు. ఘటనపై ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులందరూ సురక్షితంగా బయపడాలని లార్డ్ బద్రి విశాల్‌ను ప్రార్థిస్తున్నట్టు చెప్పారు. బీఆర్ఓ వర్క్ సైట్‌ను హిమ చరియలు విరుచుకుపడటంతో ప్రమాదం జరిగినట్టు ఉత్తరాఖండ్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ప్రతినిధి, ఐజీ నీలేష్ ఆనంద్ భర్నే తెలిపారు. నాలుగు అంబులెన్స్‌లను ప్రమాదస్థలికి పంపామని, విపరీతమైన మంచుకారణంగా సహాయక చర్యలకు అంతరాయం కలుగుతున్నట్టు బీఆర్ఓ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీఆర్ మీనా చెప్పారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను కూడా అధిగమించి బాధితులను రక్షించేందుకు ఆర్మీ, ఎస్‌డీఆర్ఎఫ్, స్థానిక అధికారులు ఆపరేషన్ సాగిస్తున్నట్టు తెలిపారు. మరోవైపు,మంచు చరియలు విరిగిపడుతుండటంతో అధికారులు హైఅలర్ట్ ప్రకటించారు. మరిన్ని మంచు చరియలు విరిగిపడే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

# వృద్ధులను కూడా వదలని అత్యాచార నిందితుడు



**పుణె, ఫిబ్రవరి 28:** ఒంటరి వృద్ధులను టార్‌ఎట్ చేసి వారివద్ద ఉన్న నగదు, నగలను బెదరించి లాక్కోవడంలోనూ అత్యారా నిందితుడు సిద్ధహస్తుడని తేలింది. నగలతో కనిపించిన పలువురు వృద్ధులను తన ట్యాక్సీలో ఎక్కించుకొని, నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి వారిని బెదిరించి.. దోపిడీలకు పాల్పడేవాడని పోలీసులు తెలిపారు. పుణెలోని స్వర్‌గేటు బస్టాండ్ వద్ద 26 ఏళ్ల యువతిపై బస్సులో అత్యాచారానికి పాల్పడిన ఘటనలో మహారాష్ట్ర పోలీసులు నిందితుడు రామ్‌దాస్‌ను పట్టుకున్నారు. ఈక్రమంలో నిందితుడి గురించి కీలక విషయాలు వెల్లడవుతున్నాయి. నిందితుడు నేర స్వభావం కలవాడని.. పలు చోరీలకు పాల్పడ్డాడని పోలీసులు పేర్కొన్నారు. 2019లో ఓ ట్యాక్సీ కొనుగోలు చేసినప్పటినుంచి పుణె–అహల్యనగర్ మార్గంలో తిప్పుతున్నట్లు విచారణలో తేలిందని అన్నారు. అప్పటినుంచి అతడు నిందితుడిపై దొంగతనం, దోపిడీ, చైన్‌స్నాచింగ్ మొదలైన పలు కేసులు ఉన్నట్లు గుర్తించామన్నారు. 2019లో ఓ నేరం కేసులో జైలు శిక్ష అనుభవించి.. ప్రస్తుతం బెయిల్‌పై బయట ఉన్నట్లు తెలిపారు. అంతేకాకుండా అతడు తరచూ స్వర్‌గేటు బస్టాండ్ వద్ద తిరుగుతూ.. అక్కడికి వచ్చిన ప్రయాణికులకు తనను తాను పోలీస్‌గా పరిచయం చేసుకునేవాడని అన్నారు. యువతిపై అత్యాచారానికి ముందు కూడా నిందితుడు ఇన్‌షర్ట్ వేసుకొని.. చాలా నీట్‌గా రెడీ అయ్యాడని, ఆమెకు కూడా తనను పోలీసుగా పరిచయం చేసుకొని, అక్క అని సంభోదిస్తూ నమ్మించాడని పేర్కొన్నారు. పుణెలోని స్వర్‌గేట్ ప్రాతంలోని బస్‌స్టాప్ వద్ద మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో స్వగ్రామానికి వెళ్లేందుకు బస్‌స్టేషన్‌కు చేరుకున్న యువతిని తన గ్రామానికి చెందిన బస్సు మరోచోట ఉందని నిందితుడు రామ్‌దాస్ నమ్మించాడు. అనంతరం కొద్ది దూరంలో ఉన్న బస్సులోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున నిరసనలు చెలరేగాయి. పోలీసులు 75 గంటల పాటు శ్రమించి పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకొన్నారు.



# ఎంతకాలమీ అప్పుల బాగోతం!

కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు ఆర్థిక క్రమశిక్షణ పాటించడం లేదు. ప్రతిదానికి కేంద్రం సాయాం చేయాలని దేబురిస్తున్నాయి. అదేపనిగా అప్పులు చేస్తూ ప్రజలపై భారం మోపుతున్నాయి. సంక్షేమ పథకాల పేరుతో అప్పులు చేసి వడ్డీలు కడుతున్నాయి. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో గత కెసిఆర్, జగన్ ఏలుబడిలో చేసిన లక్షల కోట్లు అభివృద్ధి పేరుతో దుబారా చేశారు. ఇప్పుడు వాటికి వడ్డీలకే వేలకోట్లు చెల్లించాల్సి వస్తోంది. ఇదంతా దుబారా కాక మరోటి కాదు. పథకాలపై సమీక్షించ కుండా ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు పోటీపడి ఉచిత పథకాలు అమలు చేస్తున్నాయి. పెన్షన్లు కూడా భారంగా మారాయి. కిలో రూపాయి బియ్యం పథకం కూడా భారంగా మారింది. వీటిపై సమీక్షించి, ధరలు పెంచాలన్న ఆలోచన చేయడం లేదు. ఇవన్నీ సమీక్షిస్తూ నెలకు కనీసం ఐదారువేల కోట్ల రూపాయలు మిగులుతాయి. తెలంగాణనే తీసుకుంటే వేల కోట్లు వడ్డీలు కట్టాల్సి వస్తోందని సిఎం రేవంత్ రెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యలు చూస్తే గత కెసిఆర్ ప్రభుత్వం చేసిన అప్పులు ఎంతగా పెరిగాయో గమనించవచ్చు. అలాగే జగన్ చేసిన అప్పులకు కూటమి ప్రభుత్వం కూడా కోలుకోలేకుండా పోయింది. అప్పులు చెల్లించే దుకు మరిన్ని అప్పులు చేసే బదులు ఖర్చులు తగ్గించుకోవచ్చు. దుబారాను అరికట్ట వచ్చు. కానీ ప్రభుత్వాలు అలా చేయడం లేదు. ప్రభుత్వ నిర్వహణ అంటే కేవలం అప్పులు చేసి, ప్రజలకు నగదు బదిలీ చేయడం అని జగన్ నిరూపించారు. రాష్ట్రాలన్ని ఇలా దివాళా దిశగా ఉన్నాయి. ఎక్కడా అభివృద్ధి కన్నా ఓట్లు రాబట్టే పథకాలే సాగుతున్నాయి. ఇందుకు ఏ రాష్ట్రం కూడా మినహాయింపు కాదు. అభివృద్ధి పక్కకు పోయింది. తెలంగాణలో కాళేశ్వరంపై తప్పులు ఒప్పుకోకుండా బిఆర్ఎస్ ఎదురుదాడికి దిగుతోంది. ఏ పథకం తీసుకున్నా అవినీతి కనిపిస్తోంది. నోరుంది కదాని బిఆర్ఎస్ నేతలు చేస్తున్న విపరీత వ్యాఖ్యలు,ఆరోపణలు జుగుప్స కలిగిస్తున్నాయి. ప్రతిపనికీ కేంద్రంపై ఆధారపడాల్సి వస్తోంది. రాష్ట్రాలు స్వయం సమృద్ధి సాధించకపోవడం వల్ల ఇలా దివాళా తీయాల్సి వస్తోంది. అయితే మోడీని ప్రశ్నించే ముందు తమ రాష్ట్రాల్లో తాము ఎంత సచ్ఛీలంగా పాలన చేస్తున్నామో ఆయా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలు గమనించాలి. ప్రజలు చేస్తున్నవిమర్శలకు సమాధానం చెప్పాలి. అలాగని కేంద్రం చేస్తున్న ఆర్థిక దుర్వినియోగాన్ని తప్పు పట్టకుండా ఉండలేం. కేంద్రం చేస్తున్న దుర్వినియోగాన్ని, దుర్మార్గాలను ఎండగట్టాల్సిందే. అవినీతి నేతలకు త్వరగా శిక్షలు పడాలి. అప్పుడే దేశంలో జవాబుదారీతనం వస్తుంది. ఎంతమంది అవినీతికి పాల్పడ్డారో వారందరినీ ఒకే గాటన కట్టివుంటే బాగుండేది. రాజకీయ అవినీతిని, కార్పోరేట్ మోసాలను అరికట్టే విషయంలో ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ మోడీ మాత్రం విమర్శలను పట్టించుకోవడం లేదు. ప్రజాస్వామ్యాన్ని పట్టించుకోవడం లేదు. రాజ్యాంగ వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని ఎంతకాలం ఇలా ముందుకు వెళతారన్నది చూడాలి. సిబిఐ, ఐటి, ఇడి దాడులపై వస్తున్న ఆరోపణలను పట్టించుకోవడం లేదు. ఆయా రాష్ట్రాల్లో చిచ్చు పెట్టి అధికారాన్ని చేజిక్కించు కుంటున్న తీరు కాంగ్రెస్ పాలనకన్నా దారుణంగా ఉంది. వ్యవస్థలను భ్రష్టు పట్టించిన ఘనత కాంగ్రెస్ దయితే..అంతకుమించిన దారుణాలను ఇప్పుడు మోడీ అనుసరిస్తున్నారు. ప్రజల సమస్యలను పక్కన పెట్టే ఇలాంటి చర్యలు సమర్థనీయం కాదు. ప్రజల సమస్యలను ప్రధానంగా పరిష్కరిస్తూనే...అవినీతి నేతలను బొక్కలో వేయాల్సిందే. రాజ్యాంగ సంస్థలు అందరి విషయంలో సమన్యాయంతో వ్యవహరించాల్సిన బాధ్యత వుంది. భారత ప్రజాస్వామ్యం పదికాలాలపాటు పటిష్టంగా నిలదొక్కుకోవాలంటే రాజ్యాంగ వ్యవస్థలు పటిష్టంగా పనిచేయాలి. నిష్పాక్షి కంగా నిర్ణయాలు తీసుకోవాలి. అధికారంలో ఉన్న సమయంలో అధికార పార్టీకి కొమ్ముకాసే విధంగా ఉండరాదు. ఇది ఒక్క కేంద్రం విషయంలో మాత్రమే జరగడం లేదు. రాష్ట్రాల్లో నూ ఇలాగే వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారు. కేంద్రాన్ని విమర్శిస్తున్న ప్రాంతీయ పార్టీల నేతలు తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. కేంద్రంలో అధికారంలో ఏ పార్టీ ప్రభుత్వం ఉంటే అవి రాజకీయ జోక్యంతో రాజ్యాంగ సంస్థలను తమ గుప్పిట్లో పెట్టుకుంటు న్నాయి. అందుకే రాజ్యాంగ సంస్కరణలు రావాలని మేధావులు కోరుకుంటున్నారు. ప్రధానంగా వివిధ దర్యాప్తు సంస్థలు, ఎన్నికల సంఘం,ప్రణాళికా సంఘం అంటే నీతి ఆయోగ్, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, కంప్ట్రోలర్ అండ్ ఆడిట్జనరల్ వంటి అనేక సంస్థలు జవాబు దారీగా ఉండేలా పటిష్ట రాజ్యాంగం అవసరం. దేశ సమాఖ్య విధానంలో సహకార స్ఫూర్తిని పెంపొందించాల్సిన కేంద్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. భారత రాజ్యాంగ సంస్థల పట్ల విశ్వసనీయత పెరగాలి. అవి తీసుకునే నిర్ణయాలు ఏకపక్షంగా ఉండకుండా చూసుకోవాలి. అందుకు దేశవ్యాప్తంగా చర్చచేయాలి. రాజ్యాంగాన్ని అడ్డం పెట్టుకుని స్వారీ చేసే పాలకుల తీరు మారాలి. ఇలాంటి పాలకులు వస్తారని బహుశా రాజ్యాంగ రచన చేసిన వారు ఊహించ ఉండరు. అందువల్ల వ్యవస్థలను బలోపేతం చేస్తూ..రాజకీయజోక్యం లేని పాలనా సంస్థలను రూపొందించుకోవాలి. కేంద్రంలో లేదా రాష్ట్రంలో అధికరాంలో ఉన్న పార్టీలు తమ అవసరాలకు వాటిని దుర్వినియోగం చేసే విధానాలకు చెక్ పెట్టాల్సిన అసవరం ఏర్పడింది. ప్రజలు అప్రమత్తంగా లేకుంటే పాలకులు స్వారీ చేస్తారని ప్రజలు గుర్తించాలి. ఇలా ప్రజలు నిద్రలో ఉన్నంత కాలం పాలకుల తమ విధానాలనే రుద్దుతారు. తాము చేసిందే కరెక్ట్ అని చెబుతారు. దీనిని అడ్డుకోవడం అన్నది ప్రజలు తమ కర్తవ్యంగా గుర్తించాలి.తాము అప్పగించిన అధికారం దుర్వినియోగం కాకుండా చూసుకోవాలి. నిరంతరంగా ఇలాంటి అనర్థాలపై ప్రజలు చర్చించాలి. రాజ్యాంగ వ్యవస్థల పనితీరు, పాలకుల పనితీరు, అవినీతి పాలనలపై చర్చించాలి. ఎవరు అవినీతికి పాల్పడినా తోణ శిక్షలు పడేలా చేయాలి. రాజకీయ అవినీతకి లోక్‌పాల్ లాంటి సంస్థలు రావాలి. రాజ్యాంగ పరిరక్షణతో పాలకుల అవినీతి, అక్రమాలపై మేధావులు గొంతెత్తాలి. నిరంతరం ప్రజలను జాగరూకత పర్చాలి. రాష్ట్రాలు ఆర్థిక జవాబుదారీతనంతోముందుకు సాగేలా చూడాలి. ఇష్టం వచ్చినట్లు అప్పులు చేసి, అభివృద్ధి కోసమే అంటే బోనెక్కించాల్సి రావాలి.

# బ్రాహ్మీ ముహూర్తం శుభదాయకం!




తిరుమల, ఫిబ్రవరి 28 :బ్రహ్మ ముహూర్తం లేదా బ్రాహ్మీ ముహూర్తం అన్నది మన సంస్కృతిలో బాగా ప్రాచుర్యం కలిగిన అంశం. దీనికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. కశ్యప బ్రహ్మ, వినతల తనయుడు అనూరుడు. సూర్యుని సారథిగా తన పుత్రున్ని చూడాలన్న కోరికతో వినత తన అండం ముందుగా పగులగొట్టి సగం శరీరం ఉన్న అనూరుడిని బయటకు తెచ్చింది. బ్రహ్మ దేవుడు అనూరుడిని ,సూర్యునికి సారథిగా నియమించి , నీవు భూలోకంలో మొదటగా కనిపించిన కాలాన్నే బ్రహ్మ ముహూర్తం అంటారు. ఈ సమయంలో గ్రహాలు,నక్షత్రాలు ఎటువంటి చెడు చేయలేవని వరమిచ్చాడు. ఒక పనిని ప్రారంభించడానికి ఒక సమయాన్ని అనుకొంటూ ఉంటాం. అలా నిర్ణయించుకున్న సమయాన్ని ముహూర్తం అంటారు. ఏదైనా ఒక పని చేయాలనుకోన్నప్పుడు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా ఒక మంచి సమయాన్ని చూసుకొని దానిని మంచి ముహూర్తంగా నిర్ణఇస్తారు. తెల్లవారుజామును సూర్యోదయానికి ముందు ఉన్న కాలం మంచి ముహూర్తం అంటారు. తెల్లవారుజామును రెండు భాగాలుగా విభజించారు. తెల్లవారుజామున రెండు ఘడియల ముందు కాలాన్ని 48 నిమిషముల ముందు కాలాన్ని ఆసురీ ముహూర్తం అని ఆసురీ ముహూర్తానికి ముందు 48 నిమిషముల ముందు కాలాన్ని బ్రహ్మ ముహూర్తం అంటారు. ప్రతి దినం బ్రహ్మ ముహూర్తమున ప్రారంభించిన పనులు నిర్విరామంగా, ఎటువంటి ఆటంకము లేకుండా జరుగుతాయంటారు. ఎక్కువమంది నూతన గృహప్రవేశంనకు ఈ సమయాన్ని ఎన్నుకుంటారు. ఈ సమయంలో పనులో చేస్తే మన మేధస్సుకు, భగవంతుని ఆశీస్సులు తోడవుతాయని అంటారు. ఆ సమయం ప్రశాంతంగా ఉంటుంది. సత్వగుణ ఆవిర్భావానికి అనుకూలంగా ఉంటుంది. రోజూ ఆ సమయంలో నిద్ర లేవడం ఉత్తమం. ధ్యానానికి, చదువుకోవడానికి ఆ రోజు చేయవలసిన సత్కార్యాలను నిర్ణయించుకోవడానికి అది ఉత్తమ కాలం. బ్రహ్మ ముహూర్తంలో ప్రారంబించాబోయే పనికి తిథి, వార, నక్షత్ర, దుర్ముహూర్తములను చూసుకోవలసిన పని లేదు. మంచి పని చేయాల్సివచ్చినా , లేదా కొత్త గా ఏదైనా కొనిగోలు చేసి ఉపయోగించాల్సి వచ్చినా , ఆటంకాలు కలుగుతాయే–ఎమో అన్న సందేహం లేకుండా ప్రారంభించవచ్చు.

## వైభవంగా గిరిజ మృత్యుంజయుల కళ్యాణం



తిమ్మాపూర్, జనతా న్యూస్ : కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి కాలనీలోని శ్రీ మృత్యుంజయ మహాదేవాలయంలో... వేదశ్రీ పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో శ్రీ గిరిజ మృత్యుంజయుల కళ్యాణం శుక్రవారం అర్చకులు పురుషోత్తం నేతృత్వంలో వైభవోపేతంగా జరిగింది. ఎదురుకోలు ఉత్సవం, కళ్యాణ వేడుకలో మంగళ సూత్ర ధారణ, తలంబ్రాలు, అప్పగింత కార్యక్రమాలు కన్నుల పండువగా జరిగాయి. ఎండిలోని వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ వారు మృత్యుంజయ కళ్యాణానికి పట్టు వస్త్రాలు సమర్పించారు. గిరిజా మృత్యుంజయ ల కల్యాణ వేడుకకు కన్యాధాతలుగా ఈఎన్సీ శంకర్, ఈఈ జగన్ దంపతులు, కమిటీ సభ్యులు ఉద్యోగులు, స్థానికులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. పార్వతి, పరమేశ్వరుల జననం, కల్యాణ విశిష్టతను మహేశ్వర శర్మ వివరించారు. ఆయన చెప్పిన సంకల్పములు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు చల్ల మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మణ్ రావు, కమిటీ సభ్యులు, ఉద్యోగ సంఘాల నాయకులు రామకృష్ణ, బట్టు కరుణాకర్, గంగారపు రమేష్, దారం శ్రీనివాసరెడ్డి, రవీందర్ రెడ్డి, రాగి శ్రీనివాస్, పోలూ కిషన్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం

హుజురాబాద్, ఫిబ్రవరి 28 జనతా న్యూస్: హుజూరాబాద్ నియోజకవర్గానికి నేను ఒక్కడినే ఎమ్మెల్యేని కాదని, గెలుపుకోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్త ఎమ్మెల్యేనే అని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. శుక్రవారం హుజురాబాద్ కెసి క్యాంపు లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటుచేసిన బి ఆర్ ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంప్రదిస్తే వారికి న్యాయం జరిగేలా చూసుకుంటానని అన్నారు. కార్యకర్తలతో పాటు నియోజకవర్గ ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఉంటే తనను ఫోన్లో సంప్రదిస్తే వారి సమస్యను పరిష్కరించేందుకు ఎల్లవేళలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి నియోజకవర్గ ప్రజలను ఒకే వేదికగా కలుసుకోలేకపోయానని, అతి త్వరలోనే నియోజకవర్గ ప్రజలందరిని కలుపుకుని ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేస్తానని అన్నారు. వేరువేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు ఐలయ్య, హుజురాబాద్ పిఎసిఎస్ చైర్మన్ ఎడవల్లి కొండల్ రెడ్డి, మండలంలోని కాట్రపల్లి, చిన్నపాపయ్యపల్లి, పెద్దపాపయ్యపల్లి, కందుగుల, ధర్మరాజుపల్లి, కనుకులగిద్ద, జూపాక బొత్తలపల్లి, రాంపూర్, రంగాపూర్, సిర్సపల్లి, వెంకట్రావుపల్లి, పోతిరెడ్డిపేట, సింగాపూర్, మాందాటిపల్లి, తుమ్మనపల్లి, రాజపలల్లి, చెల్పూర్, శాలపల్లి - ఇందిరానగర్, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తునపాల్గొన్నారు.

## అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెనెక్ట్ ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు



కరీంనగర్,జనతా న్యూస్: భారతదేశంలో సైన్స్ శాస్త్రానికి సి.వి రామన్ గారు చేసిన సేవలు చాలా చారిత్రాత్మకకమైనవి మరియు మన దేశానికి అన్ని రంగాలలో గుర్తింపు తెచ్చే విధంగా కృషిచేసి ఎనలేని కీర్తిని భారతదేశానికి అందించారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా॥వి. నరేందర్ రెడ్డి గారు స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ జెన్ నెక్స్ లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడులకు ముఖ్య అతిధిగా హాజరై వారు మాట్లాడారు ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి సి.వి రామన్ గారి చిత్రపటానికి పూలమాల వేసి వారు చేసిన సేవలను స్మరించుకున్నారు. సి.వి రామన్ గారు భారతదేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త అని మరియు వారి చిన్ననాటి నుండి సైన్స్ శాస్త్రంలో నిర్విరామంగా కృషిచేశారని మరియు సైన్స్లో అనేక విషయాలను కనుగొన్నారు అని గుర్తుచేశారు సైన్స్ శాస్త్రంలో మక్కువ పెంచుకొని అనేక అద్భుతాలను సృష్టించి ప్రపంచవ్యాప్తంగా ఒక ప్రత్యేక గుర్తింపు పొందాలని గుర్తుచేస్తూ వారిని అనుసరించి విద్యార్థులందరు ప్రత్యేకమైన ప్రణాళిక రూపొందించుకొని సైన్స్ లో పట్టుసాధించి నూతన ఆవిష్కరణకు సిద్ధం కావాలని సూచించారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి విద్యార్థి సైన్స్ లో నిష్ణాతులై అందులో కొత్త విషయాలు కనుగొని ప్రపంచ అభివృద్ధికి బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు. సి.వి రామన్ గారు రూపొందించినటువంటి రామన్ ఎఫెక్ట్ గుర్తింపబడినటువంటి రోజున మన భారతదేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా సైన్స్ దినోత్సవాన్ని చాలా వేడుకగా అట్టహాసంగా వివిధ రకాల కార్యక్రమాలతో ఘనంగా నిర్వహిస్తారని చెప్పారు. సర్ సి.వి రామన్ గారు ప్రత్యేకమైనటువంటి పథకాల రూపొందించడమే కాకుండా వాటిని అమలు పరిచే విధానాలను చాలా చక్కగా తెలియపరుస్తూ విద్యార్థులందరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మరియు కొత్త విషయాలు తెలుసుకొని సమాజాభివృద్ధికి బాసరగా నిలవాలని వారు గుర్తు చేశారు. పలు నమూనాలు చాలా ఆలోచింప చేయడమే కాకుండా జ్ఞానాన్ని పెంపొందించాలని వారు చెప్పారు ప్రత్యేకంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు, ఆటోమేటిక్ వాటర్ ప్లాంట్స్ సాగు విధానాలు సోలార్ సిస్టం మైక్రోస్కోప్ రక్తనమూనా పరిశీలన హైగ్రాలిక్ లిఫ్ట్ తదితర అద్భుత ఆవిష్కరణ ప్రదర్శించి విద్యార్థులు వారి యొక్క మేథోసంపత్తిని చాటారు. కార్యక్రమంలో భాగంగా సుమారు 200 పైగా నమూనాలను ప్రదర్శించి విద్యార్థులు వారి యొక్క ఆసక్తిని కనబరుస్తూ సర్ సి.వి రామన్ గారికి గొప్ప నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు వేడుకలలో భాగంగా సైన్స్ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఇంటర్ పరీక్షల పకడ్బందీగా నిర్వహించాలి : రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి

**ప్రశ్నా పత్రాల తరలింపు పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించాలి**

**పరీక్ష కేంద్రాలకు ఎవరికి సెల్ ఫోన్ అనుమతి లేదు**

**మార్చి 31 వరకు ఎల్.ఆర్.ఎస్ చేసుకుంటే రుసుములో 25% రాయితీ**

**సబ్ రిజిస్టర్ లు ఎల్ఆర్ఎస్ కింద నూతన దరఖాస్తులు స్వీకరించాలి**

**ఇంటర్ పరీక్షల నిర్వహణ, ఎల్ఆర్ఎస్ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సిఎస్**




కరీంనగర్,జనతా న్యూస్: ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. శుక్రవారం రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి ఇంటర్ పరీక్షల నిర్వహణ, ఎల్ఆర్ఎస్ పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తో కలిసి కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. ఇంటర్ పరీక్షల పై రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ, మార్చ్ 5 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కాబోతున్నాయని అన్నారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకం, శిక్షణ పూర్తయిందని, ప్రశ్న పత్రాలు చేరుకున్నాయని, రేపటి నుంచి ప్రశ్నాపత్రాలు స్ట్రాంగ్ రూమ్ లో నుంచి పోలీస్ స్టేషన్లకు చేరుతాయని అన్నారు. ప్రశ్నాపత్రాలు తరలింపు పోలీసు బందోబస్తు మధ్య ఉంటుందని అన్నారు. ఇంటర్ పరీక్షల నిర్వహణపై సమన్వయ సమావేశాలు జిల్లాలో జరిగాయని, అవసరమైన మేర ఫ్లయింగ్ స్క్వార్డులను ఏర్పాటు చేయాలని సీఎస్ సూచించారు. పరీక్షలు నిర్వహించి సంబంధిత జవాబు పత్రాలు పోస్టల్ ద్వారా పంపే వరకు వరకు జిల్లాలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ ఉండాలని, పరీక్ష కేంద్రాల వద్ద అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేసి విద్యార్థులను పూర్తిగా చెక్ చేసి లోపలికి అనుమతించాల,ని ఎటువంటి కాపీయింగ్ కు పరీక్ష కేంద్రాల్లో అవకాశం ఉండవద్దని సీఎస్ తెలిపారు. పరీక్షా కేంద్రాలకు ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బంది, విద్యార్థులు ఎవరు సెల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ తీసుకుని రావడానికి వీలు లేదని సిఎస్ స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద అవసరమైన త్రాగు నీరు, విద్యుత్ సరఫరా ఉండాలని, విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆర్టిసి బస్సులు నడపాలని అన్నారు. ఎల్ఆర్ఎస్ సమీక్షిస్తూ సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, ఎల్.ఆర్.ఎస్ - 2020 క్రింద 25 లక్షల దరఖాస్తులు వచ్చాయని, గత సెప్టెంబర్ 2024 లో జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం కొన్ని దరఖాస్తుల క్రమబద్ధీకరణ మాత్రమే జరిగిందని అన్నారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం కొన్ని నూతన నిర్ణయాలు తీసుకుందని అన్నారు. ఎల్ఆర్ఎస్ ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో రుసుము చెల్లించి క్రమబద్దికరణ చేసుకోవచ్చని తెలిపారు. మార్చి 31 వరకు క్రమబద్ధీకరణ చేసుకుంటే చెల్లించాల్సిన రుసుము లో 25% మినహాయింపు ఉంటుందని సమాచారం అందించామని అన్నారు. ఆగస్టు 26, 2020 వరకు 10% ప్లాట్లు విక్రయించిన లే ఔట్ లను క్రమబద్ధికరించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, సబ్ రిజిస్టర్ ద్వారా నిర్ణయిత నమూనాలో నూతన దరఖాస్తులు సేకరించి ఎల్ఆర్ఎస్ కోసం మున్సిపల్ శాఖకు వివరాలు పంపించి క్రమబద్ధీకరణ చేస్తామని అన్నారు. క్రమబద్ధీకరించని భూములలో ఎటువంటి రిజిస్ట్రేషన్లకు, నిర్మాణాలకు అనుమతించడం ఉండదని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా క్రమ బద్ధీకరణ చేసుకోవాలని, మార్చి 31 వరకు ప్రభుత్వం అందించిన అవకాశాన్ని వినియోగించుకొని 25% రాయితీ పొందాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, మార్చి 5,2025 నుంచి మార్చి 25, 2025 వరకు జిల్లాలో ఇంటర్ పరీక్షలు నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేశామని అన్నారు. ఇంటర్ పరీక్షలు ఉ. 9.00 నుండి మ.12.00 వరకు పరీక్షలు జరుగుతాయని, ఇంటర్ మొదటి సంవత్సరం లో 17799 మంది, రెండవ సంవత్సరం లో 17763 మొత్తం 35562 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇందుకు గాను 37 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్స్, నాలుగు సిట్టింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేశామని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్పాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా ఇంటర్మీడియట్ ఎగ్జామ్ కమిటీ మెంబర్లు ఆంజనేయరావు, సత్య వర్ధన్ రావు, శర్మ, మధ-ుమోహన్ రావ్ పాల్గొన్నారు.

## కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు అందరూ సహకరించాలి:జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, ఎన్నికల పరిశీలకులు బెన్హర్ మహేష్ దత్ ఎక్క, బుద్ధ ప్రకాష్ జ్యోతి, అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్ ఆధ్వర్యంలో ఎన్నికల బ్యాలెట్ బాక్సులు ఉంచిన స్ట్రాంగ్ రూమ్లకు శుక్రవారం తెల్లవారు జామున సీళ్లు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ.. గురువారం రాత్రి నుండి బ్యాలెట్ బాక్సులు రావడం మొదలైందని...శుక్రవారం తెల్లవారుజాము వరకు వివిధ జిల్లాల కు సంబంధించిన మొత్తం బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూముకు చేర్చామని అన్నారు. ఎన్నికల అధికారుల కృషి, వివిధ రాజకీయ పార్టీలు, అభ్యర్థుల సహకరంతో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు. మార్చ్ 3 నుండి జరిగే కౌంటింగ్ ప్రక్రియ సైతం సజావుగా సాగేందుకు అందరూ సహకరించాలని కోరారు. గ్రాడ్యుయేట్, పట్టభద్రుల బ్యాలెట్ బాక్స్ లను వేర్వేరుగా భద్రపరిచడం జరిగిందని అన్నారు. పోలింగ్ స్టేషన్ ల వారీగా లెక్కింపు ఉంటుందని తెలిపారు. మార్చి 8 వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందని పేర్కొన్నారు. స్ట్రాంగ్ రూము వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని అన్నారు . జిల్లా యంత్రాంగం స్ట్రాంగ్ రూమ్ ల వద్ద వద్ద ఫైర్ సేఫ్టీ జాగ్రత్తలను తీసుకుందని, ప్రతీ రోజు ఎన్నికల అధికారులు వీటిని పర్యవేక్షస్తారని అన్నారు. అంబేద్కర్ స్టేడియం వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు . రౌండ్ ది క్లాక్ సీసీ కెమెరాలతో నిఘా ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

## మార్చి 8న జాతీయ లోక్ అదాలత్



కరీంగనర్,జనతా న్యూస్: జాతీయ , తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టులలో మార్చి 8న జాతీయ లోక్ అదాలత్లు నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి న్యాయమూర్తి వెంకటేష్ తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవాసదన్లో శుక్రవారము ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 21 వేల పైగా కేసులు కోర్టుల్లో పెండింగ్లో ఉన్నాయని వాటిలో లోక్ అదాల లలో రాజీ చేయదగిన 3120 కేసులను గుర్తించి వాటిలోని 3120 కేసులలో కక్షిదారులకు నోటీసుల జారీ చేసినట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్లో రాజీ చేయదగిన సివిల్, క్రిమినల్, ఫ్యామిలీ, బ్యాంక్, చెక్ బౌన్స్, మోటార్ ప్రమాద కేసులు కూడా పరిష్కరించనున్నట్లు తెలిపారరు . ఈ లోక్ అదాలత్ లో రాజీ ద్వారా కేసులు పరిష్కరించుకుంటే అప్పీలు ఉండదని సమయం, డబ్బు వృధా కాకుం ఉంటుందని తెలిపారు. రాజీయే రాజమార్గంగా కక్షిదారులు ఈ లోక్ అదాలత్లను సద్వినియోగ పరి చుకొని వారిపై కేసులను పరిష్కరించుకోవాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## 10 వ తరగతి పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించాలి:జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి




సిద్దిపేట,జనతా న్యూస్: జిల్లాలో 10 వ తరగతి పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి అధికారులకు ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరెట్ లో కాన్ఫరెన్స్ హల్ జిల్లా కలెక్టర్ 10 వ తరగతి పరీక్షల నిర్వహణపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 21వ తేది నుండి ఏప్రిల్ 4వ తేది వరకు 10వ తరగతి పరీక్షల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లూ పూర్తి చెయ్యాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 79 పరీక్షా కేంద్రాల్లో 14138 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. వీరిలో రెగ్యులర్ స్టూడెంట్లు 14124 ప్రైవేట్ 14 మంది ఉన్నారన్నారు. పరీక్షలను నిష్పాక్షికంగా నిర్వహించేందుకు చీఫ్ సూపరిడెంట్స్, ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి కఠినమైన నిఘా పెట్టాలని తెలిపారు. స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేసి,ఇందుకోసం కస్టోడియన్ మరియు డిపార్ట్మెంటల్ అధికారులను నియమించాలని ఆదేశించారు.అన్ని పరీక్షా కేంద్రాల్లో ముందుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ, పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ ఉన్నందున జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎవరు సెల్ఫోన్ తీసుకురావడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు.విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా అవసరమైన మార్గాల్లో బస్సు సర్వీసులు నడిపేలా ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు,తగిన మందులతో మెడికల్ ఆఫీసర్, ఆశాలను అందుబాటులో ఉంచాలని వైద్య శాఖ అధికారులను సూచించారు.

పరీక్షా సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ గరిమా అగ్రవాల్, రెవిన్యూ అబ్దుల్ హమీద్ ఆర్డీఓలు సధానందం, చంద్రకళ, అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, డిఇఓ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పల్వాన్ కుమార్, డీపీఓ దేవకీదేవి, విద్యుత్ శాఖ ,ఆర్టీసీ, పోస్టల్, ఆర్డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మానేరు జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
Regional
శనివారం 1 మార్చి 2025


## క్రీడాకారులను అభినందించిన మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల



కరీంనగర్,జనతా న్యూస్: ఇటీవల బెంగళూరులో జరిగిన ఆల్ ఇండియా బాడీబిల్డింగ్ పోటీల్లో.. తెలంగాణ రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహించిన కరీంనగర్ నగరానికి చెందిన షేక్ జియా హుస్సేన్ జూనియర్ మిస్టర్ ఇండియా టైటిల్ గెల్చుకున్నారు. అదే విధంగా హైదరాబాదులో జరిగిన ఆల్ఇండియా కరాటే పోటీల్లో.. కరీంనగర్ నగరానికి చెందిన మహమ్మద్ సజ్జాద్ బ్లాక్ బెల్ట్ సాధించారు. ఈ నేపథ్యంలో వారు నేడు కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.ల ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల వారిని అభినందించి శాలువాతో సత్కరించారు. మరిన్ని విజయాలు సాధించి ఇటు రాష్ట్రానికి అటు దేశానికి మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగులతో పాటు బిఆర్ఎస్ పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షులు మీర్ షౌకత్ అలీ, మాజీ కార్పొరేటర్లు వాల రమణారావు, దిండిగాల మహేష్, తోట రాములు, బోనాల శ్రీకాంత్, నాయకులు గందె మహేష్, కర్ర సూర్య శేఖర్, ఆసిమ్ తదితరులు ఉన్నారు.



## కొన్నాళ్లు సైన్స్ అధ్యాపకుడిగా పనిచేశా

### కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్

**ఢిల్లీ:** కొన్నాళ్లపాటు తాను సైన్స్ అధ్యాపకుడిగా పని చేశానని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా డీఆర్‌డీవో విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన ప్రదర్శనకు కేంద్ర రక్షణమంత్రి హాజరై ప్రసంగించారు. నోబెల్ గ్రహీత సర్ సీవీ రామన్ ఫిబ్రవరి 28న రామన్ ఎఫెక్ట్‌ను కనుగొన్నారని.. ఆయన గౌరవార్థం ఏటా ఈరోజును జాతీయ సైన్స్ దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని గుర్తు చేశారు. ప్రస్తుతం వ్యవసాయంతో పాటు అన్ని రంగాల్లో సైన్స్ ముఖ్యపాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. తాను కూడా సైన్స్ విద్యార్థినేనని.. కొన్నాళ్లు సైన్స్ అధ్యాపకుడిగా కూడా పనిచేసినట్లు పునరుద్ఘాటించారు. సైన్స్ వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులు గమనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులనుద్దేశించి ప్రసంగించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. మానవ పరిణామ క్రమాన్ని, సైన్స్ అభివృద్ధిని విద్యార్థులు అధ్యయనం చేయాలని సూచించారు. ఇన్నోవేషన్, దేశ ప్రగతిలో విద్యార్థులదే కీలకపాత్రన్న ఆయన.. అందుకనుగుణంగా కొత్త ఆవిష్కరణలకు అలవాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పుల కనుగుణంగా ఉండాలన్నారు. నూతన ఆవిష్కరణలకు భారత్ హబ్‌గా రూపొందుతోందని పేర్కొన్నారు. దేశంలో సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతోందని, రక్షణ రంగంలోనూ అనేక మార్పులు తీసుకొస్తోందని తెలిపారు.



## అమెరికా 'బ్లాక్‌మెయిల్'కు పాల్పడుతోంది

**బీజింగ్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు పెంచుతూ తీసుకున్న నిర్ణయంపై పలు దేశాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ వ్యవహారంపై తాజాగా చైనా కూడా కీలక వ్యాఖ్యలు చేసింది. ఫెంటనిల్ అంశాన్ని వాడుకుంటూ సుంకాల పేరుతో ఒత్తిడి చేయడంతోపాటు బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతోందని ఆరోపించింది. చైనా దిగుమతులపై 10శాతం అదనపు సుంకాలు విధిస్తామని ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో డ్రాగన్ ఈ విధంగా స్పందించింది. "టారిఫ్ ఒత్తిడిలు, బ్లాక్‌మెయిల్ కోసం ఫెంటనిల్ అంశాన్ని అమెరికా వాడుకుంటోంది. ఈ పరిణామాలు తీవ్ర ప్రభావం చూపడమే కాకుండా, ఒత్తిడి, నిర్బంధం, మాదకద్రవ్యాల నియంత్రణలో ఇరుదేశాల మధ్య చర్చలు, సంప్రదింపులకు ముప్పుగా మారుతుంది" అని చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి లిన్ జియాంగ్ పేర్కొన్నారు. అయితే, పరిస్థితులు మారకుంటే ఈ చర్యలకు ఎదురుదెబ్బ తప్పదని హెచ్చరించారు.అమెరికా విదేశాంగశాఖ కార్యదర్శి మార్కో రుబియో కూడా ఇదే అంశంపై మాట్లాడుతూ.. చైనాపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఫెంటనిల్‌పై చైనా రివర్స్ యుద్ధం చేస్తోందని ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగానే అమెరికాలోకి దానిని పెద్దఎత్తున పంపిణీ చేస్తుండవచ్చనే అనుమానం వ్యక్తం చేశారు. చైనా కామర్స్ మినిస్ట్రీ స్పందిస్తూ.. అత్యంత కఠినమైన మాదక ద్రవ్యాల నిరోధక విధానాలు అమలు చేస్తున్నామని పేర్కొంది. వీలైనంత త్వరగా అమెరికా చర్చలు జరపాలని చూస్తున్నామని, లేదంటే ప్రతీకారం తప్పదని హెచ్చరించింది.మెక్సికో, కెనడాల దిగుమతులపై ప్రతిపాదించిన 25శాతం సుంకాలు మార్చి 4వ తేదీ నుంచి అమల్లోకి రానున్నట్లు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే. అటు మిత్ర దేశాలపైనా త్వరలోనే 25శాతం సుంకాలను విధిస్తానని స్పష్టం చేశారు. ఇక చైనా ఉత్పత్తులపై ఇప్పటికే 10శాతం సుంకాలు విధించిన ట్రంప్.. అదనంగా మరో పది శాతం విధిస్తున్నట్లు ప్రకటించారు. వీటిపై ఇప్పటికే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండగా.. రెండో విడత ప్రతీకార సుంకాలను ఏప్రిల్‌లో ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని ట్రంప్ చెప్పడం గమనార్హం.

# రాష్ట్రాన్ని రక్షించుకుందాం.. ముందుకు రండి

### తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ పిలుపు



**చెన్నై :** నియోజకవర్గాల విభజన, త్రిభాషా విధానంపై కేంద్రంలోని బీజేపీ, తమిళనాడులోని అధికార డీఎంకేల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈక్రమంలో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కోవడానికి ప్రతి పౌరుడు కదిలి రావాలని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. ఈమేరకు ఆయన శుక్రవారం ఎక్స్ వేదికగా ఓ వీడియోను విడుదల చేశారు. 'త్రిభాషా, నియోజకవర్గాల పునర్విభజన వంటి రెండు క్లిష్టమైన సవాళ్లను ప్రస్తుతం తమిళనాడు ఎదుర్కొంటుంది. వీటికి వ్యతిరేకంగా పోరాడేందుకు రాష్ట్రంలోని ప్రతి పౌరుడు ముందుకురావాలి. మన నిజమైన పోరాటాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని మిమ్మల్ని అభ్యర్థిస్తున్నా. నియోజకవర్గాల విభజన మన రాష్ట్ర ఆత్మగౌరవాన్ని ప్రభావితం చేస్తోంది. కర్ణాటక, పంజాబ్‌తో పాటు తెలంగాణ వంటి రాష్ట్రాలు సైతం దీనికి సంఘీభావం తెలిపాయి. కేంద్రం తను ఇష్టానుసారం తీసుకుంటున్న నిర్ణయాలను ఈ రాష్ట్రాలు ప్రతిఘటిస్తున్నాయి. త్రిభాషా విధానాన్ని వ్యతిరేకించినందుకు మనకు రావాల్సిన నిధులు నిలిపివేశారు. తమిళనాడులో పార్లమెంటు నియోజకవర్గాలను తగ్గించబోమని చెబుతూనే.. ఇతర రాష్ట్రాల్లో పెంచమని హామీ ఇవ్వలేకపోతున్నారు. మా డిమాండు స్పష్టంగా ఉంది. జనాభా ప్రాతిపదికన మాత్రమే నియోజకవర్గాలు నిర్ణయించవద్దు. రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా జరిగే వాటిని తమిళనాడు ప్రతిఘటిస్తుంది. విజయం సాధిస్తుంది' అని స్టాలిన్ పేర్కొన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ద్వారా తక్కువ జనాభా ఉన్న రాష్ట్రాల్లో పార్లమెంట్ స్థానాలు తగ్గుతాయంటూ తమిళనాడు కొంతకాలంగా చెబుతోంది. ఇటీవల ఈ అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా (%కూఎఖ రాష్ట్రుప్త%) మాట్లాడారు. పునర్విభజన ప్రక్రియ ద్వారా దక్షిణాది రాష్ట్రాల్లో పార్లమెంటు స్థానాలు తగ్గవని స్పష్టం చేశారు. తమిళనాడు సీఎం స్టాలిన్ ఈ అంశంపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఇక, దీనిపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య స్పందిస్తూ.. హోంమంత్రి మాటలు నమ్మేలా లేవని, ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

## పాక్ నంబరు నుంచి మహారాష్ట్ర సీఎంకు బెదిరింపులు



**ముంబయి :** మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌కు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ బెదిరింపులు పాకిస్థాన్ ఫోన్ నంబరు నుంచి రావడం గమనార్హం. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం ముంబయి ట్రాఫిక్ పోలీసులకు వాట్సప్‌లో బెదిరింపు సందేశం వచ్చింది. అందులో సీఎం కార్యాలయాన్ని పేల్చేస్తామంటూ గుర్తుతెలియని వ్యక్తులు బెదిరింపులకు పాల్పడ్డారు. ఆ మెసేజ్ చేసిన వ్యక్తి పేరు మాలిక్ షాబాజ్ హుమయూన్ రాజాదేవ్‌గా పేర్కొన్నాడు. ఈ బెదిరింపుల నేపథ్యంలో సీఎం, ఆయన కార్యాలయంతో పాటు ఇతర ప్రభుత్వ భవనాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఇక, ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండేకు సైతం బెదిరింపులు వచ్చిన సంగతి తెలిసిందే. ఆయన వాహనాన్ని బాంబుతో పేల్చేస్తామంటూ గుర్తుతెలియని వ్యక్తులు ముంబయి పోలీసులకు మెయిల్ చేశారు. దీనిపై దర్యాప్తు చేయగా.. అది బూటకమని అధికారులు తేల్చారు.

## సిద్ధరామయ్యపై 'శీష్ మహల్' తరహా ఆరోపణలు



**బెంగళూరు :** ఇప్పటికే ముడా స్కామ్‌లో ఆరోపణలు ఎదుర్కొంటున్న కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మరో వివాదంలో ఇరుక్కున్నారు. ఆయన అధికారిక నివాసాన్ని 'శీష్ మహల్' తరహాలో పునరుద్ధరించడానికి ప్రజాపనుల విభాగం దాదాపు రూ. 2.6 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఒకవైపు ప్రభుత్వం వద్ద నిధులు లేవని పేర్కొంటూ.. మరోవైపు అధికారులు అనవసర ఖర్చులు చేస్తున్నారని భాజపా ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్ విమర్శించారు. రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన మిగతా పనులు పూర్తిచేసిన తర్వాత ముఖ్యమంత్రి తన సొంత పనులు చేసుకోవడంపై దృష్టిసారించాలన్నారు. ప్రభుత్వ నిధులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. ప్రభుత్వం వాటిని ఇతర ప్రయోజనాలకు మరలిస్తుందని అన్నారు. ప్రభుత్వం ఇదేవిధంగా వ్యవహరిస్తే రాష్ట్ర అభివృద్ధి కుంటుపడుతుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం అధికారిక భవనం పునరుద్ధరణలో భాగంగా రూ. 1.7 కోట్లను హెల్పర్ రూమ్‌లు, ఇతర నిర్మాణాలకు కేటాయించగా, రూ. 89 లక్షలను ఎలక్ట్రికల్ అప్‌గ్రేడ్, ఎయిర్ కండిషనింగ్ మొదలైన సదుపాయాల కోసం వినియోగించినట్లు ఆర్థికశాఖ నుంచి నివేదికలు వెలువడడంతో ప్రతిపక్ష నేతలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) భూముల వ్యవహారంలో అక్రమాలకు పాల్పడినట్లు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ఇప్పటికే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యమంత్రి, ఆయన సతీమణి పార్వతి, బావమరిది మల్లికార్జునపై కేసులు నమోదు కావటం, లోకాయుక్త ఎస్పీ టి.జె.ఉదేశ్ నేతృత్వంలో విచారణ ప్రారంభమైంది. అయితే తాజాగా దీనిపై విచారణ జరిపిన లోకాయుక్త పోలీసులు ఆయనకు వ్యతిరేకంగా ఆధారాల్లేవని పేర్కొన్నారు.ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు 'సీఎం బంగ్లా' వివాదం రాజకీయ దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ బంగ్లాను 'శీష్ మహల్ (అద్దాల మేడ) అంటూ భాజపా తీవ్ర విమర్శలు చేసింది. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి ఆయన 7-స్టార్ రిసార్ట్‌గా మార్చుకున్నారని విమర్శించింది. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ఆప్ మోసాలకు ఆ మహల్ ఓ ఉదాహరణ అంటూ భాజపా ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లింది. ఆప్ ప్రభుత్వంపై వచ్చిన ఈ అవినీతి ఆరోపణలతో పాటు 'శీశ్ మహల్' విమర్శలు కూడా ఆ పార్టీ ఓటమిలో కీలకంగా మారాయి.

## బద్రీనాథ్‌లో విరిగిపడిన మంచుచరియలు


### చిక్కుకున్న 41 మంది కార్మికులు



**బద్రీనాథ్ :** ఉత్తరాఖండ్‌లో పెను ప్రమాదం చోటుచేసుకుంది. గత కొన్ని రోజులుగా ఇక్కడ భారీగా మంచు కురుస్తుండటంతో శుక్రవారం ఉదయం మంచు చరియలు విరిగిపడ్డాయి. వాటికింద పదుల సంఖ్యలో కార్మికులు చిక్కుకుపోయారు. బద్రీనాథ్ ధామ్‌లోని జాతీయహైవేపై ఈ ఘటన చోటు చేసుకుంది. సమాచారమందుకున్న పోలీసులు, బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్ఓ) సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. కార్మికులు అక్కడ రోడ్డు నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. బద్రీనాథ్‌కు సమీపంలో ఉన్న మనా గ్రామంలోని బీఆర్ఓ క్యాంప్‌కు సమీపంలోనే ఈ ఘటన చోటుచేసుకుంది. మొత్తం 57 మంది కార్మికులు మంచు చరియల కింద చిక్కుకుపోయినట్లు బీఆర్ఓ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీఆర్ మీనా వెల్లడించారు. ఇందులో 16 మందిని రక్షించి క్యాంప్‌కు తరలించారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మిగతా 41 మంది కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఘటనాస్థలంలో అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. అయితే, మంచు దట్టంగా కురుస్తుండటంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతోందని బీఆర్ఓ అధికారులు వెల్లడించారు. ఘటనపై రాష్ట్ర ముఖ్య మంత్రి పుష్కర్ సింగ్ ధామి స్పందించారు. సహాయక చర్యలు వేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే కార్మికులందరినీ కాపాడుతామని తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్‌తో పాటు ఆర్మీ కూడా రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టింది. ఘటన జరిగిన మన గ్రామం.. బద్రీనాథ్‌కు కేవలం మూడు కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. భారత్-టిబెట్ సరిహద్దును ఆనుకుని సముద్ర మట్టానికి 3,200 మీటర్ల ఎత్తులో ఉంది.

## మార్చి 15 నుంచి 'స్పేడెక్స్' ప్రయోగాలు

### ఇస్రో చీఫ్ వి.నారాయణన్



**ఢిల్లీ:** అంతరిక్ష ప్రయోగాల్లో భాగంగా ఉపగ్రహాలను నింగిలోనే అనుసంధానం చేసే మిషన్‌ను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ చేపట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికే రెండు ఉపగ్రహాలను విజయవంతంగా అనుసంధానం చేసిన ఇస్రో.. ఈ ప్రయోగాలను పునఃప్రారంభించేందుకు సిద్ధమైంది. మార్చి 15 నుంచి స్పేడెక్స్ ప్రయోగాలు చేపట్టనున్నట్లు ఇస్రో చీఫ్ వి.నారాయణన్ వెల్లడించారు."ప్రస్తుతం ఆ ఉపగ్రహం దీర్ఘవృత్తాకార కక్ష్యలో ఉంది. వివిధ ప్రయోగాలు చేపట్టేందుకు రెండు నెలల్లో 10 నుంచి 15 రోజుల అనుకూల సమయం లభిస్తుంది. ప్రస్తుతం వాటిని విడదీసి, రీ-డాకింగ్ చేసేందుకు అనుకరణ ప్రయోగాలు చేస్తున్నాం. ఇప్పటికే ఓ ప్రణాళిక సిద్ధం చేసుకున్నాం' అని ఇస్రో ఛైర్మన్ వి.నారయణన్ పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మార్చి 15 నుంచి ఈ ప్రయోగాలను చేపడతామన్నారు.ఉపగ్రహాల్లో తగినంత ఇంధనం ఉందని.. తదుపరి అనేక ప్రయోగాలు చేయాలనుకుంటున్నామని ఇస్రో చీఫ్ వెల్లడించారు. అంతేకాదు, రెండు నెలల తర్వాత వచ్చే అనుకూల సమయంలోనూ మూడో దశ ప్రయోగాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. డాకింగ్, దృఢత్వ ప్రయోగాల అనంతరం రెండు ఉపగ్రహాల మధ్య విద్యుత్ శక్తి బదిలీ ప్రయోగాలు చేయాలనే ప్రణాళికలు వేసుకున్నట్లు ఇస్రో గతంలోనే చెప్పింది.ఇదిలాఉంటే, అంతరిక్ష ప్రయోగాల్లో భాగంగా ఉపగ్రహాలను నింగిలోనే అనుసంధానించే మిషన్‌ను ఇస్రో చేపట్టింది. ఇందులో భాగంగా గతేడాది డిసెంబర్ 30న ఛేజర్, టార్గెట్ జంట ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపించింది. పలు ప్రయత్నాల అనంతరం చివరకు జనవరి 16న డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా చేపట్టింది. దీంతో ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ నిలిచింది.


## 29 మంది డ్రగ్‌లార్డ్స్‌ను అమెరికాకు అప్పగించిన మెక్సికో



**మెక్సికో :** పొరుగుదేశమైన మెక్సికో మాదకద్రవ్యాల పుట్టగా మారిపోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదటినుంచి ఆగ్రహంగా ఉన్నారు. అక్కడినుంచి తమ దేశంలోకి మత్తుమందులు సరఫరా అయితే అదనపు సుంకాలు విధిస్తానని హెచ్చరించారు. అంతేకాదు.. ఆ ముఠాల పెద్దతలకాయలను తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. దీంతో తాజాగా మెక్సికోలోని 8 నగరాల్లోని జైళ్ల నుంచి మొత్తం 29 మంది కరడుగట్టిన మాదకద్రవ్యాల రవాణాదారులను అమెరికాలోని నగరాలకు పంపించారు. ఈవిషయాన్ని మెక్సికో ప్రభుత్వం వెల్లడించింది. అమెరికా విధించనున్న 25శాతం సుంకాలను అడ్డుకోవడానికే వీరిని అప్పగించారు. తాజాగా అమెరికాకు అప్పగించిన వారిలో అత్యంత క్రూరమైన రఫెల్ కారో క్వింటెరో కూడా ఉన్నాడు. 1985లో అమెరికా డీఈఏ ఏజెంట్ ఎన్రిక్ కికి కమరెనా హత్య కేసులో ప్రధాన నిందితుడు. ఇక ఆ దేశంలోని ఆరు ప్రధాన ముఠాల్లో ఐదింటికి చెందిన సభ్యులను ట్రంప్ సర్కారు గ్లోబల్ టెర్రరిస్టులుగా ప్రకటించింది. దీనిపై అమెరికా అటార్నీ జనరల్ పామెలా బోండీ స్పందిస్తూ.. "అమెరికా ప్రజలను ఈ ముఠాల నుంచి కాపాడేందుకు ధైర్యవంతులైన అధికారులు తమ కెరీర్ మొత్తం కృషి చేశారు. కొందరు ప్రాణాలు కోల్పోయారు. ఈ నిందితులను చట్టాలకు అనుగుణంగా విచారిస్తాము" అని పేర్కొన్నారు. మరోవైపు మెక్సికో విదేశాంగ మంత్రి జువాన్ రామన్ డె లామ ఫ్యూంటే అమెరికాలో పర్యటించి సెక్రటరీ ఆఫ్ స్టేట్ మార్కో రూబియోతో భేటీ అయ్యారు. అదే సమయంలో ఈ ముఠా సభ్యులను అమెరికాకు అప్పగించారు. మెక్సికోలో మాదకద్రవ్యాల ముఠాలను, అక్రమ వలసదారులను కట్టడి చేయాలని, ఫెంటెనిల్ తయారీని అడ్డుకోవాలని ట్రంప్ హెచ్చరించారు. ఇవి చేస్తేనే అదనపు సుంకాల అమల్లో కొంత సమయం ఇస్తామని తేల్చిచెప్పారు. అమెరికా డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ (డీఈఏ) మాజీ చీఫ్ మైక్ విజిల్ మాట్లాడుతూ మెక్సికో చరిత్రలో ఇలా ఎన్నడూ చేయలేదని వెల్లడించారు. కారో క్వింటెరో అప్పగింత విషయంలో అమెరికా చాలా పట్టుదలగా ఉండటంతో మెక్సికో తలొంచక తప్పలేదు. ఇతడు గ్వాడలనలజర ముఠా నాయకుడు. అమెరికా డీఈఏ ఏజెంట్ హత్య కేసుకు సంబంధించిన కేసును 2013లో అక్కడి న్యాయస్థానం కొట్టేయడంతో విడుదలయ్యాడు. మళ్లీ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, ఆధిపత్య పోరులో బిజీగా మారాడు. దీంతో 2022లో ఇతడిని మరోసారి అరెస్టు చేశారు. కానీ, అమెరికాకు అప్పగింత విషయంలో జాప్యం జరిగింది. కానీ, ట్రంప్ అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారిపోయింది.


## మాస్ కాపీయింగ్‌కు టీచర్ సాయం

### సోషల్ మీడియాలో వైరల్



**బేతుల్ :** బోర్డ్ ఎగ్జామ్స్‌లో మాస్ కాపీయింగ్‌కు టీచర్ సహాయం చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆమెను విధుల నుంచి తొలగించిన ఘటన మధ్యప్రదేశ్‌లో చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల బేతుల్ జిల్లాలోని ఓ పాఠశాలలో 5వ తరగతి బోర్డ్ పరీక్షలు నిర్వహించారు. ఆ పరీక్ష హాలులో సంగీతావిశ్వకర్మ అనే ఉపాధ్యాయురాలిని ఇన్విజిలేటర్‌గా నియమించినట్లు గిరిజన శాఖ సహాయ కమిషనర్ శిల్పాజైన్ తెలిపారు. లెక్కల పరీక్ష జరుగుతున్న సమయంలో విద్యార్థులు సమాధానాల కోసం పలుమార్లు ఆమెను అభ్యర్థించడంతో ఆమె బోర్డుపై జవాబులు రాసి విద్యార్థులు వాటిని ఎక్కించుకోవడానికి సాయం చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో బేతుల్ కలెక్టర్ నరేంద్రకుమార్ సూర్యవంశీ ఆ ఉపాధ్యాయురాలిని విధుల నుంచి బహిష్కరించారు. ప్రస్తుతం విచారణ జరుపుతున్నామని.. ఆమె తప్పు చేసినట్లు రుజువైతే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కేసులో పరీక్షా కేంద్రం ఇన్‌ఛార్జి, ఇతర అధికారులపైనా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనతో మధ్యప్రదేశ్ విద్యాశాఖ ఉపాధ్యాయులందరికీ కఠినమైన హెచ్చరికలు జారీ చేసింది. పరీక్షల సమయంలో ఇటువంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పర్యవేక్షణ ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించింది.

## ఐఐటీ రూర్కీలోనూ నా జూమ్ మీటింగ్ హ్యాక్ అయ్యింది : శామ్ పిట్రోడా



**రూర్కీ:** ఐఐటీ రాంచీలోని విద్యార్థులతో వర్చువల్‌గా ప్రసంగిస్తుండగా.. తన కాన్ఫరెన్స్‌ను ఎవరో హ్యాక్ చేశారంటూ కాంగ్రెస్ సీనియర్ నేత శామ్ పిట్రోడా ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే ఆయన ఐఐటీ రూర్కీలో మాట్లాడుతుండగా మరోసారి హ్యాకింగ్ జరిగిందని పేర్కొన్నారు. ఈమేరకు ఎక్స్ వేదికగా ఆయన పోస్టు చేశారు. 'ఫిబ్రవరి 1న కాగ్నిజెంట్ ఈవెంట్ సందర్భంగా ఐఐటీ రూర్కీలో విద్యార్థులు, అధ్యాపకులతో జూమ్ మీటింగ్‌లో పాల్గొనేందుకు నాకు ఆహ్వానం వచ్చింది. మీటింగ్ ముగిసిన కొన్ని నిమిషాలకే ఆ కాన్ఫరెన్స్ హ్యాకింగ్‌కు గురై.. అసభ్యకరమైన వీడియోలు ప్రసారమయ్యాయి. విద్యాసంస్థల్లో మీటింగ్‌లో ఉన్నప్పుడు ఇలాంటి సంఘటనలు జరగడం దురదృష్టకరం. సైబర్ సెక్యూరిటీ ఒక క్లిష్టమైన సమస్యగా మారింది. ఇది డిజిటల్ భద్రత, అప్రమత్తత ప్రాముఖ్యతను తెలుపుతుంది' అని తాజా పోస్టులో రాసుకొచ్చారు. ఇటీవల ఐఐటీ రాంచీలో ప్రసంగిస్తుండగా.. ఇలాంటి ఘటనే జరిగిందని పిట్రోడా ఓ వీడియోలో పేర్కొన్నారు. దీన్ని ప్రజాస్వామ్యం అంటారా? సంస్థలకు స్వయంప్రతిపత్తి ఉండటమే అసలైన ప్రజాస్వామ్యం అన్నారు. అయితే, దీనిపై కేంద్ర విద్యాశాఖ స్పందించింది. అది ఐఐటీ రాంచీ కాదని.. ఐఐఐటీ విద్యాసంస్థ అని స్పష్టంచేసింది.

# సచిన్ రికార్డులపై కన్నేసిన విరాట్ కోహ్లీ



ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఆదివారం భారత్, న్యూజిలాండ్ మధ్య మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే ఇరు జట్లు సెమీస్‌కు చేరగా.. ఈ మ్యాచ్‌లో గెలిచిన టీమ్ గ్రూప్-ఎలో అగ్రస్థానంలో నిలుస్తుంది. ఇక, పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో శతకం బాది ఫామ్‌లోకి వచ్చిన విరాట్ కోహ్లీకి కివీస్‌పై మంచి రికార్డు ఉంది. ఆదివారం జరిగే మ్యాచ్‌లోనూ విరాట్ రాణించాలని అభిమానులతోపాటు టీమ్ మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. న్యూజిలాండ్‌తో జరిగే పోరులో కోహ్లీ అదరగొడితే సచిన్ పేరిట ఉన్న పలు రికార్డులను బ్రేక్ చేస్తాడు. విరాట్ 106 పరుగులు చేస్తే సచిన్‌ను అధిగమించి కివీస్‌పై వన్డేల్లో అత్యధిక రన్స్ చేసిన భారత ఆటగాడిగా రికార్డు సృష్టిస్తాడు. ప్రస్తుతం సచిన్ తెందూల్కర్ (1750) ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాడు. కివీస్‌పై సచిన్ 42 వన్డేలు ఆడి ఐదు సెంచరీలు, ఎనిమిది హాఫ్ సెంచరీలు సాధించాడు. కోహ్లీ 31 వన్డేల్లో (1645 రన్స్) 6 శతకాలు, 9 అర్ధ శతకాలు చేశాడు. ఓవరాల్‌గా రికీ పాంటింగ్ (1971 పరుగులు, 51 మ్యాచ్‌లు) టాప్‌లో ఉన్నాడు. కింగ్ కోహ్లీ ఆదివారం మ్యాచ్‌లో 85 రన్స్ చేస్తే న్యూజిలాండ్‌పై 3 వేల పరుగులు పూర్తి చేసుకున్న ఐదో బ్యాటర్‌గా నిలుస్తాడు. భారత్ తరఫున సచిన్ (3,345) ఒక్కడే ఈ ఫీట్ సాధించాడు. రికీ పాంటింగ్ (3,145), జాక్వెస్ కలిస్ (3,071), జో రూట్ (3,068) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. న్యూజిలాండ్‌పై ఇప్పటివరకు అన్ని ఫార్మాట్లలో కలిపి 55 మ్యాచ్‌లు ఆడి 47.01 సగటుతో 2,915 రన్స్ చేశాడు. ఇందులో తొమ్మిది సెంచరీలు, 15 అర్ధ సెంచరీలున్నాయి. కివీస్‌పై కోహ్లీ చివరి వన్డే 2023 ప్రపంచ కప్‌లో ఆడాడు. ఆ సెమీ ఫైనల్ మ్యాచ్‌లో 117 పరుగులు చేశాడు. లీగ్ దశలో ఇదే జట్టుపై కోహ్లీ (95) త్రుటిలో శతకం చేజార్చుకున్నాడు.

## అఫ్గాన్‌తో మ్యాచ్ వర్షార్పణం..

### సెమీస్‌కు చేరిన ఆస్ట్రేలియా



**లాహోర్:** కీలకమైన అఫ్గానిస్థాన్, ఆస్ట్రేలియా మ్యాచ్ వర్షం కారణంగా రద్దైంది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో 273 పరుగులకు ఆలౌటైంది. సెదిఖుల్లా అటల్ (85), అజ్మతుల్లా ఒమర్జాయ్ (67) రాణించారు. 274 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన ఆసీస్ 12.5 ఓవర్లకు 1 వికెట్ కోల్పోయి 109 పరుగులు చేసింది. ఆ సమయానికి ట్రావిస్ హెడ్ 59, స్టీవ్ స్మిత్ 19 పరుగులతో నాటౌట్‌గా క్రీజులో నిలిచారు. సరిగా అప్పుడే చినుకులు ప్రారంభమయ్యాయి. అంపైర్లు ఆటను నిలిపివేశారు. తర్వాత వర్షం కాస్త పెద్దదైంది. అనంతరం వాన ఆగిపోయినా ఔట్‌ఫీల్డ్‌లో భారీగా నీళ్లు నిలిచిపోయాయి. నిర్ణీత సమయంలోగా ఔట్‌ఫీల్డ్ సిద్ధం కాకపోవడంతో అంపైర్లు ఆటను రద్దు చేశారు. ఆసీస్, అఫ్గానిస్థాన్‌కు చెరో పాయింట్ కేటాయించారు. గ్రూప్ బి నుంచి నాలుగు పాయింట్లతో ఆస్ట్రేలియా సెమీస్ బెర్త్ ఖాయం చేసుకుంది. మూడు పాయింట్లతో అఫ్గానిస్థాన్ టోర్నీ నుంచి నిష్క్రమించింది.




## ఐపీఎల్ 2025..

### మళ్లీ కలిసిన ధోనీ, అశ్విన్

ఐపీఎల్-2025 సీజన్ ఆరంభానికి సమయం ఆసన్నమవుతోంది. మార్చి 22 నుంచి మే 25 వరకు ఈ మెగా టోర్నీ జరగనుంది. మొత్తం 74 మ్యాచులు 65 రోజుల పాటు జరుగుతాయి. ఈడెన్ గార్డెన్స్ వేదికగా తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడతాయి. ఫైనల్ మ్యాచ్‌కు ఈడెన్ గార్డెన్స్ ఆతిథ్యమివ్వనుంది. సీజన్ ఆరంభానికి దాదాపు 20 రోజులే సమయం ఉండటంతో ఆయా ఫ్రాంఛైజీలు సాధన శిబిరాలు ఏర్పాటుచేసి తమ ఆటగాళ్లను రప్పిస్తున్నాయి. చెన్నై సూపర్ కింగ్స్ టీమ్ ప్రాక్టీస్ కూడా మొదలెట్టింది. మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోనీ, రవిచంద్రన్ అశ్విన్ కూడా శిబిరంలో చేరారు. అశ్విన్, ధోనీ కలిసి సాధన చేస్తున్న వీడియోను సీఎస్కే సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. సీఎస్కేతోనే ఐపీఎల్ కెరీర్‌ను మొదలుపెట్టిన అశ్విన్ చాలాకాలంపాటు జట్టులో కీలకంగా ఉన్నాడు. తర్వాత వివిధ కారణాలతో చెన్నై సూపర్ కింగ్స్‌ని వీడాడు. కెరీర్ ముగింపు దశలో మళ్లీ సొంత గూటికి చేరుకున్నాడు. ధోనీ, అశ్విన్ మళ్లీ కలిసి ఆడుతుండటంతో చెన్నై అభిమానులు ఖుషీ అవుతున్నారు. యాష్ రాకతో సీఎస్కే స్పిన్ విభాగం మరింత పటిష్టంగా మారింది. ధోనీ, అశ్విన్‌ల మధ్య మంచి ఫ్రెండ్‌షిప్ ఉన్న విషయం తెలిసిందే. వికెట్ల వెనక ఉండే మహీ ఎలాంటి బంతులేసి బ్యాటర్లను బోల్తా కొట్టించాలో యాష్‌కు చెప్పేవాడు. వచ్చే సీజన్‌లోనూ వీరి మ్యాజిక్ పనిచేయాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఐపీఎల్-2025లో చెన్నై సూపర్ కింగ్స్ తొలి మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్‌తో తలపడనుంది. మార్చి 23న చెపాక్‌లో ఈ మేటి జట్ల పోరు జరగనుంది.



ఛాంపియన్స్ ట్రోఫీలో టీమ్‌ఇండియా వరుసగా రెండు మ్యాచ్‌ల్లో గెలిచి సెమీస్‌కు చేరింది. టోర్నీకి పాకిస్థాన్ ఆతిథ్యమిస్తుండగా.. భారత్ మ్యాచ్‌లు మాత్రం దుబాయ్‌లో నిర్వహిస్తున్నారు. రోహిత్ సేన ఆడే సెమీఫైనల్ మ్యాచ్ కూడా దుబాయ్‌లోనే జరగనుంది. ఒకవేళ భారత్ ఫైనల్‌కు చేరితే ఆ మ్యాచ్ కూడా యూఏఈలోనే నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించారు. భద్రతా కారణాల వల్ల టీమ్‌ఇండియాను పాకిస్థాన్‌కు పంపడానికి భారత్ నిరాకరించిన విషయం తెలిసిందే. అయితే, టీమ్‌ఇండియా ఒకే వేదికపై మ్యాచ్‌లు ఆడుతుండటం వల్ల భారీ ప్రయోజనం పొందుతోందని ఆసీస్ ప్లేయర్ ప్యాట్ కమిన్స్, ఇంగ్లండ్ కెప్టెన్ జోస్ బట్లర్, పాక్ హెడ్ కోచ్ అకీబ్ జావేద్ వ్యాఖ్యానించారు. ఇంగ్లండ్ మాజీలు మైకేల్ అథర్టన్, నాజర్ హుస్సేన్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. తాజాగా ఈ జాబితాలో సౌతాఫ్రికా టాపార్డర్ బ్యాటర్ వాన్ డెర్ డస్సెన్ కూడా చేరాడు. దుబాయ్‌లోనే మ్యాచ్‌లు ఆడటం వల్ల టీమ్‌ఇండియాకు లాభం చేకూరుతోందన్న విషయాన్ని అర్థం చేసుకోవడానికి రాకెట్ సైంటిస్ట్ కానక్కర్లేదని డస్సెన్ పేర్కొన్నాడు. 'ఇది కచ్చితంగా టీమ్‌ఇండియాకు ప్రయోజనం చేకూర్చుతుంది. ఒకేచోట, ఒకే హోటల్‌లో ఉంటూ అక్కడి మైదానంలోనే అవే పిచ్‌లపై ఆడితే కచ్చితంగా అడ్వాంటేజ్ ఉంటుంది. అది తెలుసుకోవాలంటే మీరు రాకెట్ సైంటిస్ట్ అయి ఉండక్కర్లేదు. ఆ ప్రయోజనాన్ని ఉపయోగించుకోవాల్సిన బాధ్యత వారిపై ఉంటుంది. సెమీ లేదా ఫైనల్‌లో ఎవరు ఆడతారో వారు అక్కడికి (దుబాయ్) వెళ్లాలి. ఆ జట్టుకు అక్కడి పరిస్థితులు కొత్తగా ఉంటాయి. టీమ్‌ఇండియా మాత్రం ఆ వాతావరణానికి అలవాటుపడి ఉంటుంది. దీంతో కొత్తగా అక్కడ ఆడుతున్న జట్టుపై ఒత్తిడి ఉంటుంది' అని డస్సెన్ వివరించాడు. సౌతాఫ్రికా ప్రస్తుతం మూడు పాయింట్లతో గ్రూప్ బిలో అగ్రస్థానంలో ఉంది. ఒకవేళ ఆ జట్టు సెమీస్‌కు చేరితే దుబాయ్‌లో టీమ్‌ఇండియాతో (మార్చి 4) లేదా లాహోర్‌లో న్యూజిలాండ్‌తో (మార్చి 5) తలపడాల్సి ఉంటుంది. ఈ విషయంపై డస్సెన్ స్పందించాడు. తనవరకైతే దుబాయ్ కంటే లాహోర్‌లోనే ఆడటం సులభంగా ఉంటుందన్నాడు.



## మెటాలో డేటా లీక్..

### ఉద్యోగులపై వేటువేసిన సంస్థ

మార్క్ జుకర్‌బర్గ్ నేతృత్వంలోని టెక్ సంస్థ మెటా కొందరు ఉద్యోగులపై వేటు వేసింది. ముఖ్యమైన సమాచారాన్ని మీడియాకు పంపించారనే కారణంతో కొంతమందిని సంస్థ నుంచి తొలగించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి ఓవైపు ఒత్తిడి ఎదుర్కొంటున్న సంస్థ ఇలా ఉద్యోగులను తొలగించడం చర్చనీయాంశమైంది. మెటా తాజాగా నిర్వహించిన దర్యాప్తులో కంపెనీకి సంబంధించిన సమాచారాన్ని కొందరు బహిర్గతం చేసినట్లు తేలిందని సంస్థ తెలిపింది. ఈ కారణంతో దాదాపు 20 మందిని తొలగించిందని స్పష్టంచేసింది. ఇలా డేటా లీక్ చేసినవారిలో మరికొంతమంది ఉండే అవకాశం ఉందని పేర్కొంది. కంపెనీ పాలసీకి వ్యతిరేకంగా ప్రవర్తించినందుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. ఇకపై లీక్‌లు జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. "ఎటువంటి ఉద్దేశంతోనైనా అంతర్గత సమాచారాన్ని లీక్ చేయడం అనేది కంపెనీ విధానాలకు విరుద్ధమని సంస్థలో చేరినప్పుడే ఉద్యోగులకు తెలియజేశాం. క్రమంగా ఈవిషయాన్ని గుర్తు చేస్తాం" అని మెటా ప్రతినిధి ఒకరు తెలిపారు. ఇలాఉండగా.. జుకర్‌బర్గ్ తాజా సమావేశాల అనంతరం తొలగింపుల ప్రకటన రావడం గమనార్హం. అయితే ఏ అంశం బహిర్గతమైందనే విషయాన్ని మాత్రం కంపెనీ వెల్లడించలేదు. మరోవైపు మెటా తన కార్యకలాపాల్లో పలు మార్పులు తీసుకొచ్చింది. వైవిధ్య కార్యకలాపాలు చేపట్టకపోవడం, కంటెంట్ పాలసీల్లో మార్పులు, తక్కువ ప్రతిభను చూపిన ఉద్యోగులను తొలగించింది.

# భారీ నష్టాల్లో సూచీలు

### సెన్సెక్స్ 1400 పాయింట్లు పతనం



**ముంబయి :** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు, బ్యాంకింగ్, ఐటీ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి కారణంగా సూచీలు భారీగా పతనమయ్యాయి. సెన్సెక్స్ 1400 పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ 22,200 దిగువకు చేరింది. స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ షేర్లలోనూ అమ్మకాలు వెల్లువెత్తాయి. ఆసియా మార్కెట్లలో సియోల్, టోక్యో, షాంఘై, హాంకాంగ్ షేర్లూ భారీ నష్టాల్లో ముగిశాయి. మదుపర్ల సంపద దాదాపు రూ.9 లక్షల కోట్లు ఆవిరైంది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.384 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 74,201.77 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,612.43) నష్టాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 73,141.27 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1414.33 పాయింట్ల నష్టంతో 73,198.10 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 420.35 పాయింట్ల నష్టంతో 22,124.70 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 33 పైసలు కోల్పోయి 87.51 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టాల్లో ముగిశాయి. టెక్ మహీంద్రా, ఇండస్ ఇండ్ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్ షేర్లు భారీగా నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 73 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2874 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

### నష్టాలకు కారణాలు ఇవే..

- అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికైనప్పటినుంచి స్టాక్ మార్కెట్‌లో అనిశ్చితి కొనసాగుతోంది. ఎప్పటికప్పుడు ట్రంప్ చేస్తున్న టారిఫ్ ప్రకటనలు వాణిజ్య యుద్ధ భయాలు రేపుతున్నాయి. మెక్సికో, కెనడాపై విధించిన సుంకాలు మార్చి 4 నుంచి అమల్లోకి వస్తాయని ప్రకటించారు. తాజాగా చైనాపై అదనంగా మరో 10 శాతం సుంకం విధిస్తానని ట్రంప్ ప్రకటించడం గమనార్హం. చైనాపై సుంకాలూ అదేరోజు నుంచి అమలవుతాయని పేర్కొన్నారు. ఈయూపైనా 25 శాతం సుంకాలు వేస్తామని ప్రకటించారు. ఈ ప్రకటనలు మదుపర్లలో ఆందోళనకు కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.
- దేశీయ బ్యాంకుల నాలుగో త్రైమాసిక ఫలితాలు బలహీనంగా నమోదుకావొచ్చన్న అంచనాలు కూడా మార్కెట్ పతనానికి మరో కారణమని అనలిస్టులు చెబుతున్నారు. ఇప్పటికే క్యూ3 ఫలితాలు నిరాశపరిచిన నేపథ్యంలో క్యూ4కు సంబంధించిన తాజా అంచనాలు మరింత ఆందోళనలోకి నెట్టేశాయి.
- ఈక్విటీ మార్కెట్‌లో విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు కొనసాగుతున్నాయి. ఇన్నాళ్లూ ఎఫ్ఐఐలు అమ్మకాలకు దిగినా.. డీఐఐలు మన మార్కెట్లను నిలబెట్టాయి. అయితే, ఎఫ్ఐఐల విక్రయాలు కొనసాగుతుండడంతో డీఐఐలు సైతం కొనుగోళ్ల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారని విశ్లేషకులు చెబుతున్నారు.
- చైనా ఈ మధ్య ప్రైవేటు వ్యాపారులకు అనుకూలంగా వ్యవహరిస్తుండడంతో ఎఫ్ఐఐలు చైనాకు తరలిపోతున్నాయని అనలిస్టులు అభిప్రాయపడుతున్నారు. చైనా స్టాక్స్ తక్కువ వాల్యూషన్స్‌లో లభిస్తుండడం, చైనా ఎకానమీ బలంగా పుంజుకొంటుందన్న అంచనాలు ఇందుకు కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు.



## తగ్గిన బంగారం ధర


**న్యూఢిల్లీ:** గత కొన్ని రోజులుగా సరికొత్త రికార్డులను తిరగ రాస్తూ దూసుకెళ్లిన బంగారం.. కాస్త నెమ్మదించింది. దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాములు స్వచ్ఛమైన పసిడి ధర శుక్రవారం నాటికి రూ.500 మేర క్షీణించి రూ.87,700కు చేరింది. అంతకు ముందు ట్రేడింగ్ సెషన్‌లో ఈ మొత్తం రూ.88,200గా ఉంది. జ్యువెల ర్స్ నుంచి డిమాండ్ తగ్గడం, మదుపర్లు లాభాల స్వీకర ణకు దిగడంతో బంగారం ధర తగ్గుముఖం పట్టినట్లు ఆలిండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. జన వరి 1 నాటికి 10 గ్రాముల పసిడి ధర రూ.79,390 గా ఉండగా.. రెండు నెలల వ్యవధిలో దాదాపు 10 శాతం మేర పెరిగి రూ.87,700 స్థాయికి చేరడం గమనార్హం. అటు వెండి సైతం భారీగా తగ్గింది. గురువారం రూ.98,500గా ఉన్న కిలో వెండి ధర రూ.2100 మేర తగ్గి రూ.96,400కు దిగి వచ్చింది.




## మూడో త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 6.2%

**న్యూఢిల్లీ:** దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి కాస్త నెమ్మదించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికంలో (అక్టోబర్-డిసెంబర్) స్థూల జాతీయోత్పత్తి వృద్ధి 6.2 శాతంగా నమోదైనట్లు కేంద్ర గణాంక కార్యాలయం శుక్రవారం తెలిపింది. తయారీ, మైనింగ్ రంగాల్లో పేలవమైన పనితీరు కారణంగా వృద్ధి క్షీణించిందని పేర్కొంది. గతేడాది ఇదే సమయంలో జీడీపీ 9.5 శాతంగా నమోదైంది. జులై- సెప్టెంబర్ త్రైమాసికంలో నమోదైన ఆర్థిక వృద్ధి 5.6 శాతంతో పోలిస్తే క్యూ3లో పెరగడం గమనార్హం. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ 6.4 శాతం వృద్ధి నమోదవుతుందని జనవరిలో వెలువరించిన అంచనాల్లో పేర్కొంది. అలాగే, 2023-24 ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధి రేటు అంచనాలను 8.2 శాతం నుంచి 9.2 శాతానికి సవరించింది.

# ఈపీఎఫ్ వడ్డీ ఈసారీ 8.25 శాతమే..



**న్యూఢిల్లీ:** ఉద్యోగుల భవిష్య నిధి ఖాతాల్లో నిల్వలపై వడ్డీరేటు ఖరారైంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ 8.25 శాతం వడ్డీరేటునే కొనసాగించాలని ఈపీఎఫ్ఓ నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ నేతృత్వంలో శుక్రవారం జరిగిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ 237వ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. దీంతో పాటు ఈడీఎల్ఐకి సంబంధించిన పలు సవరణలకు కూడా బోర్డు ఆమోదం తెలిపింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి కూడా ఇదే వడ్డీని చెల్లించిన సంగతి తెలిసిందే. సీబీటీ నిర్ణయాన్ని కేంద్ర ఆర్థిక శాఖకు పంపనున్నారు. ప్రభుత్వం నుంచి ఆమోదం వచ్చిన తర్వాత వడ్డీ రేటును ఈపీఎఫ్ఓ అధికారికంగా నోటిఫై చేస్తుంది. ఆ తర్వాత వడ్డీ మొత్తాన్ని ఈపీఎఫ్ఓ 7 కోట్ల చందాదారుల ఖాతాల్లో జమ చేస్తుంది. సీబీటీ ప్రతిపాదనలపై కేంద్ర ఆర్థికశాఖ త్వరలోనే నిర్ణయం తీసుకోనుంది.

### పదేళ్లలో వడ్డీ ఇలా..

2014-15: 8.75 శాతంబీ 2015-16 : 8.8 శాతంబీ 2016-17 : 8.65 శాతంబీ 2017-18 : 8.55 శాతంబీ 2018-19: 8.65 శాతంబీ 2019-20 : 8.5 శాతంబీ 2020-21 : 8.5 శాతంబీ 2021-22: 8.1 శాతంబీ 2022-23 : 8.15 శాతంబీ 2023-24: 8.25 శాతం

### కనీస బీమా రూ.50 వేలు

ఈపీఎఫ్ సభ్యులు సర్వీసులో ఉండగా చనిపోతే బాధిత కుటుంబాలకు ఈడీఎల్ఐ కింద జీవిత బీమా సదుపాయాలు అందుతున్నాయి. సర్వీసు ఆధారంగా రూ.2.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు బీమా సొమ్ము లభిస్తోంది. అయితే, చందాదారులు కనీసం ఏడాది సర్వీసు పూర్తిచేయకుం డా మరణిస్తే బీమా సహాయం రూ.11 వేల నుంచి రూ.13వేలలోపు మాత్రమే ఉంటోంది. ఇక నుంచి ఏడాదిలోగా మరణిస్తే కనీస బీమా రూ.50వేలు చెల్లించాలని సమావేశంలో నిర్ణయించారు. అనారోగ్యం, ప్రమాదం, ఇతర కారణాలతో ఈపీఎఫ్ చందా చెల్లించని రోజులు నెల కన్నా ఎక్కువగా ఉంటే ఈ పథకం వర్తించట్లేదు. ఇకపై అలా కాకుండా చివరి చందా చెల్లించిన ఆరునెలల్లోగా ఉద్యోగి మరణిస్తే బాధిత కుటుంబా నికి ఈ పథకం కింద సర్వీసు కాలం ప్రకారం సొమ్ము లభిస్తుంది. దీనివల్ల ఏటా 14వేల కేసులకు ప్రయోజనం లభిస్తుంది. ఉద్యోగి ఒక కంపెనీ నుంచి మరో కంపెనీకి మారినపుడు ఈపీఎఫ్ సర్వీసుకు ఒక్కరోజు విఘాతం కలిగినా ఈడీఎల్ఐ పథకం నుంచి బయటకు వచ్చినట్లు భావిస్తూ బీమా సదుపాయాన్ని ఇవ్వడం లేదు. ఇకపై రెండు నెలలు వ్యవధి వచ్చినా సర్వీసులో కొనసాగుతున్నట్లు భావించి.. కనీస బీమా రూ.2.5 లక్షలు అందించాలని ట్రస్టీల సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.



## 22 ఏళ్ల స్కైప్ సేవలకు మైక్రోసాఫ్ట్ గుడ్‌బై

ప్రముఖ టెక్ సంస్థ మైక్రోసాఫ్ట్ తన వీడియో కాన్ఫరెన్సింగ్ ప్లాట్‌ఫామ్ స్కైప్ సర్వీసులకు గుడ్‌బై చెప్పేందుకు సిద్ధమైంది. త్వరలో ఈ సేవలను శాశ్వతంగా నిలిపివేయనుందని సమాచారం. ఈ విషయాన్ని ఎక్స్‌డీఏ తన నివేదికలో వెల్లడించింది. స్కైప్ తన వీడియో కాన్ఫరెన్సింగ్ సేవల్ని 2003లో తొలుత ప్రారంభించింది. 2011లో మైక్రోసాఫ్ట్ ఈ సర్వీసుల్ని కొనుగోలు చేసింది. అలా 22 ఏళ్ల పాటు స్కైప్ తన సేవల్ని అందిస్తూ వచ్చింది. అయితే, 2017లో మైక్రోసాఫ్ట్ టీమ్స్‌ను లాంచ్ చేసినప్పటి నుంచి స్కైప్ అంతర్గతంగా పోటీ ఎదుర్కొంటోంది. దీంతో స్కైప్‌కి ఉన్న ఆదరణ క్రమంగా తగ్గుతూ వచ్చింది. దీంతో ఎప్పుడో ఒకప్పుడు స్కైప్ మూసేస్తారన్న ఊహాగానాలు మొదలయ్యాయి. ఈక్రమంలోనే స్కైప్ సేవలకు గుడ్‌బై చెప్పేందుకు మైక్రోసాఫ్ట్ సిద్ధమైంది. మే నుంచి ఈ సేవలు నిలిచిపోనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు స్కైప్ వాడుతున్న వారు టీమ్స్‌కు మారాల్సి ఉంటుంది. అక్కడ నుంచి కాల్స్, చాట్ కొనసాగించొచ్చు.



## జలపాతం అందాన్ని మించి మాళవిక అందం..!

కేరళ ముద్దుగుమ్మ మాళవిక మోహనన్ 2013లో 'పట్టం పోల్' అనే మలయాళ సినిమాతో ఇండస్ట్రీలో అడుగు పెట్టింది. నటిగా కెరీర్ ఆరంభంలో కాస్త ఒడిదొడుకులు ఎదుర్కొన్నా ఆ తర్వాత బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో మంచి గుర్తింపు దక్కించుకుంది. ముఖ్యంగా తమిళ్‌లో ఈమె నటించిన సినిమాలకు మంచి స్పందన వచ్చింది. తమిళనాట స్టార్ హీరోలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా ఈ అమ్మడు నిలిచింది. రజనీకాంత్, విజయ్ వంటి స్టార్ హీరోలతో తమిళనాట సినిమాలు చేసిన మాళవిక మోహనన్ టాలీవుడ్‌లో మాత్రం ఇప్పటి వరకు కనిపించలేదు. ఎట్టకేలకు ప్రభాస్ రాజాసాబ్ సినిమాలో ఈ అమ్మడు నటిస్తోంది.

మాళవిక మోహనన్ ప్రస్తుతం చేస్తున్న రాజాసాబ్ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. సినిమా ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచ్చిన పదేళ్ల తర్వాత టాలీవుడ్‌లో అడుగు పెట్టబోతున్న ఈ ముద్దుగుమ్మకు మంచి ఫ్యూచర్ ఉంటుంది అంటూ నెటిజన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభాస్ వంటి పాన్ ఇండియా స్టార్ సినిమాలో నటించడం ద్వారా కచ్చితంగా ఈమెకు వరుసగా ఆఫర్లు దక్కే అవకాశాలు ఉన్నాయి. ఇండస్ట్రీలో వరుసగా సినిమాలు చేయడంతో పాటు సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఫాలోవర్స్‌కి కన్నుల విందు చేస్తూ ఉంటుంది. తాజాగా మరోసారి ఫాలోవర్స్‌ని ఆకట్టుకునే ఫోటోలను షేర్ చేసింది. సాధారణంగా అందగత్తెలు రెడ్ కలర్ డ్రెస్ ధరిస్తే మరింత అందంగా కనిపిస్తారు అంటారు. మాళవిక మోహనన్ రెడ్ డ్రెస్‌లో నడుము అందం చూపిస్తూ, నాభి అందాన్ని చూపిస్తూ షేర్ చేసిన ఈ ఫోటోలు చూపు తిప్పనివ్వడం లేదు. మాళవిక వెనుక అందమైన జలపాతం ఉంది. ఆ జలపాతం అందాన్ని బీట్ చేసే విధంగా మాళవిక రెడ్ డ్రెస్ అందం ఉందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. లాంగ్ షాట్‌తో పాటు, క్లోజప్‌లోనూ మాళవిక మోహన్ చాలా అందంగా ఈ డ్రెస్‌లో కనిపిస్తుందని, జలపాతం అందాన్ని డామినేట్ చేసే విధంగా మాళవిక ఉందంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.



## తల్లి కాబోతున్న కియారా

బాలీవుడ్ స్టార్ కపుల్ కియారా అద్వానీ, సిద్ధార్థ్ మల్హోత్రా గుడ్ న్యూస్ చెప్పారు. త్వరలోనే తాము ఓ బిడ్డకు జన్మనివ్వబోతున్నట్టు సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. తమ జీవితానికి సంబంధించిన గొప్ప గిఫ్ట్ త్వరలోనే రానుందంటూ బేబీ ఎమోజీని జోడిస్తూ ఇద్దరి చేతుల్లో బేబీ సాక్స్‌ను పట్టుకుని ఓ ఫోటోను పోస్ట్ చేస్తూ విషయాన్ని వెల్లడించారు. కియారా, సిద్ధార్థ మల్హోత్రా 2023లో ఫిబ్రవరి 7న రాజస్థాన్ లో పెళ్లి చేసుకున్నారు. షేర్షా మూవీ నుంచి వీరిద్దరికీ పరిచయం ఏర్పడి అది ముందు స్నేహంగా మారి, ఆ తర్వాత ప్రేమకు దారి తీసింది. తర్వాత ఇరు కుటుంబ సభ్యులను ఒప్పించి పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకుని ఇద్దరూ ఒక్కటయ్యారు. రీసెంట్ గా సెకండ్ వెడ్డింగ్ యానివర్సరీ జరుపుకున్న ఈ జంట ఇప్పుడు తల్లిదండ్రులు కానున్నట్టు అనౌన్స్ చేశారు. విషయం తెలుసుకున్న సెలబ్రిటీలు, ఫ్యాన్స్ కియారా, సిద్ధార్థ్ జంటకు శుభాకాంక్షలు తెలుపుతూ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇప్పుడు ఈ వార్త నెట్టింట వైరల్ అవుతుంది. రీసెంట్ గా గేమ్ ఛేంజర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన కియారా చేతిలో ప్రస్తుతం పలు సినిమాలున్నాయి. ప్రస్తుతం యశ్ హీరోగా వస్తున్న టాక్సిక్ మూవీతో పాటూ వార్2లో కూడా నటిస్తోంది కియారా. ఇదిలా ఉంటే గత నెలలో కియారా ఆరోగ్యం గురించి కొన్ని వార్తలు వినిపించాయి. కియారా అనారోగ్యంతో బాధపడుతుందని, ఆరోగ్యం బాలేనందున హాస్పిటల్ లో కూడా చేరిందని సోషల్ మీడియాలో పుకార్లు వచ్చాయి. ఇప్పుడు ఈ గుడ్ న్యూస్ చెప్పడంతో ఆమె అనారోగ్యం గురించి వచ్చిన వార్తలకు చెక్ పడినట్లైంది. కియారా తల్లి కాబోతుందని తెలుసుకున్న ఆమె ఫ్యాన్స్ ఎంతో ఆనందిస్తున్నారు.



## బ్లాక్ అండ్ వైట్‌లో మృణాల్ భలే ముచ్చటగా..!

తెలుగు ప్రేక్షకులకు సీతారామం సినిమాతో పరిచయం అయిన ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్. మొదటి సినిమాతోనే టాలీవుడ్‌లో టాప్ స్టార్ హీరోయిన్స్ జాబితాలో చేరింది. అప్పటి నుంచి వరుసగా సినిమాలు చేస్తూనే ఉంది. మరో వైపు హిందీలోనూ ఈ అమ్మడి సినిమాల జోరు కొనసాగుతోంది. సినిమా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన దాదాపు పదేళ్ల తర్వాత తెలుగులో సీతారామం సినిమాతో సక్సెస్‌ను దక్కించుకుంది. గ్లామరస్ పాత్రలతో, స్కిన్ షో పాత్రలతో నార్త్‌లో నటించినా పెద్దగా గుర్తింపు రాలేదు. బుల్లితెరపైనా ఈ అమ్మడు తన సత్తా చాటేందుకు ప్రయత్నించింది. అయితే సీతారామం సినిమా తీసుకు వచ్చిన స్థాయి ఆమెకు మునుపు ఎప్పుడూ నార్త్ లో దక్కలేదు. లవ్ సోనియా అనే హిందీ సినిమాతో బాలీవుడ్‌లో అడుగు పెట్టిన ఈ అమ్మడు సూపర్ 30తో పాటు పలు సినిమాల్లో నటించింది. కొన్ని సినిమాలు సూపర్ హిట్ అయినా నటిగా అంతగా గుర్తింపు రాలేదు. కెరీర్ ఆరంభం నుంచి ఆఫర్ల కోసం వెతుకులాట కొనసాగించిన మృణాల్ ఠాకూర్ ఇప్పుడు మాత్రం చేతిలో అర డజను సినిమాలతో బిజీ బిజీగా ఉంది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి నటన ప్రతిభ ఉన్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్. అందుకే కెరీర్ ఆరంభంలో లక్ కలిసి రాకున్నా అందంగా ఉండటం వల్ల ఆఫర్లు వచ్చాయి. ఇప్పుడు అదృష్టం కలిసి వచ్చి వరుస సినిమాలు సక్సెస్ కావడంతో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు దక్కించుకుంది. హీరోయిన్‌గా ఎంత బిజీగా ఉన్నా సోషల్ మీడియాలో ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోత ఫోటోల షేరింగ్ మాత్రం తగ్గదు. 1.4 కోట్ల ఫాలోవర్స్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో కలిగి ఉన్న ఈ అమ్మడు వారి కోసం రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూనే ఉంటుంది. తాజాగా మరోసారి ఈ అమ్మడు తన అందమైన ఫోటోలను షేర్ చేసింది. అయితే ఈసారి ఈ అమ్మడు బ్లాక్ అండ్ వైట్‌లో విభిన్నమైన స్టైలిష్ లుక్‌లో ఫోటోలను షేర్ చేసింది. స్లీవ్‌లెస్ బనియన్‌ను ధరించి క్యూట్‌గా నవ్వుతూ చూపు తిప్పనివ్వకుండా చేస్తున్న మృణాల్ ఫోటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోలకు లైక్స్, షేర్స్ అత్యధికంగా వస్తున్నాయి.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com